


# శివసూర్య

SHIVA SURYA TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

RNI APTEL : 2023/88704


శివసూర్య
విలేకర్లు కావలెను
కర్నూలు జిల్లా, నంద్యాల జిల్లాల నుండి విడుదలవుతున్న సంచలన సమాచార దినపత్రిక శివసూర్య తెలుగు దినపత్రికలో పని చేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్సీ ఇంచార్జ్‌లు & మండల విలేకర్లు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
ఎడిటర్: బి. శివరాముడు
9494741301, 9346185399.

కర్నూలు సంపుటి : 03, సంచిక : 280 ఛీఫ్ ఎడిటర్.. పేజిలు : 08, వెల రూ. 2రూ/ శనివారం - 20 - జూన్ - 2026

Published From Kurnool : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad

## మనకు ఎప్పటికీ ఆయనే స్ఫూర్తి
## రాహుల్ బర్త్‌డే సందర్భంగా రేవంత్ విషెస్




- రాహుల్ గాంధీ పుట్టినరోజు
- దేశ వ్యాప్తంగా వేడుకలు

## ట్రంప్ మాట బేఖాతరు.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు

దక్షిణ లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు




వైమానిక దాడుల్లో దాదాపు 16 మంది మృతి

ఇటీవలే అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందం

ఒప్పందం ప్రకారం లెబనాన్‌పైనా సైనిక చర్యలు ఆపాలి

అమెరికా హెచ్చరికలను బేఖాతరు చేసిన నెతన్యాహు

తాజా ఘర్షణలతో శాంతి ప్రయత్నాలకు గండిపడే అవకాశం




## అరణ్యారామం భవనానికి శంకుస్థాపన చేసిన పవన్

తాడేపల్లి: గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం బ్రహ్మానందపురం అటవీ శాఖ ప్రాంతంలో అరణ్యారామం అనే పేరిట నిర్మించనున్న భవనానికి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. సుమారు రూ.27 కోట్లతో నిర్మించనున్న ఈ భవనంలో మానవ , వన్యప్రాణి సంఘర్షణ నివారణ కేంద్రం, ఫారెస్ట్ ఫైర్ కమాండ్ కంట్రోల్ సెంటర్, స్టేట్ టైగర్ మానిటరింగ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. వీటికోసం రెండు హెక్టార్లలో భవనం నిర్మించనున్నారు. భూమి పూజ అనంతరం పవన్ కల్యాణ్ అటవీ ప్రాంతంలో మొక్కను నాటారు. మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ , అటవీ శాఖ స్పెషల్ సెక్రటరీ కాంతిలాల్, దండి అటవీ దళపతి చలపతిరావు పాల్గొన్నారు.







## సంస్కరణల అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ముందంజలో ఉంది
## "ఈ రోజు బెంగాల్ ఏది ఆలోచిస్తుందో, రేపు భారత్ అదే ఆలోచిస్తుంది

- బలమైన రాష్ట్రాలే బలమైన దేశాన్ని నిర్మిస్తాయి.. మాకు ఇగోలు లేవు
- కోల్‌కతాలో ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సదస్సులో లోకేశ్ కీలక ప్రసంగం
- రాష్ట్ర అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కావాలని పెట్టుబడిదారులకు ఆహ్వానం

అమరావతి: బలమైన రాష్ట్రాలే బలమైన దేశాన్ని నిర్మించగలవని, రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీతోనే దేశాభివృద్ధి సాధ్యమని

# రాష్ట్రాన్ని పారిశ్రామిక, తయారీ హబ్‌గా మార్చడమే లక్ష్యం

## ఏపీ పారిశ్రామికాభివృద్ధికి సహకరించండి..

పారిశ్రామికవేత్తలకు మంత్రి లోకేశ్ పిలుపు

- కోల్‌కతాలో ప్రముఖ పారిశ్రామికవేత్తలతో మంత్రి నారా లోకేశ్ భేటీ
- ఏపీలో పెట్టుబడులకు ఉన్న సానుకూల అంశాలను వివరించిన లోకేశ్
- ఏపీ ప్రభుత్వ చురుకైన విధానాలను అభినందించిన పారిశ్రామికవేత్తలు



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామిక, తయారీ రంగ కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, ఇందుకు పారిశ్రామికవేత్తలు సహకరించాలని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ఆయన కోల్‌కతాలో పర్యటించారు. మిగతా 2 లో

## భారత్, ఫ్రాన్స్‌ను ఫుట్‌బాల్ కలుపుతోంది

- భారత్-ఫ్రాన్స్ ఫుట్ బాల్ కనెక్షన్... ప్రధాని మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు




- పారిస్‌లో 'బోంజౌర్ మోదీ' కార్యక్రమంలో ప్రవాస భారతీయులతో భేటీ

## మేకెదాటు డ్యామ్ కు వ్యతిరేకంగా తమిళనాడు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం

మేకెదాటు వద్ద కావేరి నదిపై కర్ణాటక నిర్మిస్తున్న ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తీర్మానం

ఈ ప్రాజెక్ట్ చట్ట విరుద్ధమన్న సీఎం విజయ్

ఇటీవల మోదీని కలిసినప్పుడు ఇదే విషయాన్ని ప్రస్తావించిన విజయ్

తమిళనాడు: కావేరీ నదీ జలాల పంపిణీ విషయంలో కర్ణాటక,



తమిళనాడు రాష్ట్రాల మధ్య దశాబ్దాలుగా సాగుతున్న వివాదం.. 'మేకెదాటు డ్యామ్' ప్రతిపాదనతో మరోసారి తీవ్రరూపం దాల్చింది. కర్ణాటక ప్రభుత్వం కావేరీ నదిపై మేకెదాటు వద్ద కొత్త డ్యామ్ నిర్మాణానికి జరుపుతున్న ప్రయత్నాలను మిగతా 2 లో

# విధ్వంసమైన విద్యాశాఖను వికాసం వైపు నడిపిస్తున్నాం

## విద్యార్థులు ఆత్మగౌరవంతో పాఠశాలకు వెళ్లేందుకు ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేస్తున్నాం

హైదరాబాద్: విద్యార్థులు ఆత్మగౌరవంతో పాఠశాలకు వెళ్లేందుకు ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యపై నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని చెప్పారు. నగరంలోని ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీని గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కలిసి సీఎం ప్రారంభించారు. గురుకుల పాఠశాల విద్యార్థులకు 22 వస్తువులతో కిట్లు అందించారు. వసతి గృహ విద్యార్థులకు 10, పాఠశాల విద్యార్థులకు 7 వస్తువులతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

"తెలంగాణ భాషా ప్రయుక్తరాష్ట్రంగానో, పాలనా సౌలభ్యం కోసమో ఏర్పడింది కాదు. 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, విద్యార్థుల ఆత్మ బలిదానాలతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైంది. తెలంగాణ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, ఉపాధి కోసం ఎంతోమంది త్యాగాలు చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉంది.. వాటిని పునరుద్ధరించాలి. విద్యాశాఖను గతంలో విధ్వంసం చేశారు. గత పాలకుల అరాచకంతో రాష్ట్రానికి వందేళ్ల నష్టం జరిగింది. తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ




రూపొందించి ప్రక్షాళన చేపట్టాం. విధ్వంసమైన విద్యాశాఖను వికాసం వైపు నడిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం బడ్జెట్‌లో 8.5 శాతం నిధులు కేటాయించాం. వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం రూ.26,600 కోట్లు ఖర్చు చేస్తున్నాం. వీటిని భావితరాల భవిష్యత్తును నిర్ణయించే పెట్టుబడులుగా భావిస్తున్నాం. ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో నో అడ్మిషన్ బోర్డు పెట్టారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇలా బోర్డు పెట్టే పరిస్థితి వస్తుందని ఎవరూ ఊహించి ఉండరు. ఉద్యోగులకు జీతాల మాదిరిగానే ప్రతినెలా ఒకటో తేదీన విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు.




## వచ్చే ఎన్నికల్లోనూ నిన్ను వెంటాడి మరీ ఓడిస్తాం"
## "కార్మికులకు, మాకు మధ్య రావాలని చూస్తే ఖబడ్దార్

- గతంలో చేసిన తప్పులకే నిన్ను వెంటబడి ఓడించాం
- మంత్రి శ్రీధర్ బాబుకు కవిత మాస్ వార్నింగ్
- సింగరేణి బాయిబాట కార్యక్రమంలో పాల్గొన్న కవిత

హైదరాబాద్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో నిర్వహించిన సింగరేణి 'బాయిబాట' కార్యక్రమం తీవ్ర రాజకీయ వేడిని రగిల్చింది. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును టార్గెట్ చేస్తూ తెలంగాణ రక్షణ సమితి (టీఆర్ఎస్)

## గాంధీ సరోవర్‌కు గ్రీన్ సిగ్నల్..
# రేవంత్ ధన్యవాదాలు




- రక్షణ మంత్రిత్వ శాఖ సహకారానికి తెలంగాణ ప్రభుత్వం తరుపున ధన్యవాదాలు
- మూసీ పునరుజ్జీవనలో గాంధీ సరోవర్ ప్రాజెక్టు కీలక మైలురాయిగా భావిస్తున్నాం
- మూసీ పరివాహక ప్రాంతాన్ని సాంస్కృతిక ప్రజా వారసత్వ ఆస్తిగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యం
- హైదరాబాద్‌లోని బాపూఘాట్ (ఈసీ, మూసీ నదుల సంగమ ప్రాంతం) వద్ద 'గాంధీ సరోవర్' ప్రాజెక్టును నిర్మిస్తున్నారు

## పేదల పక్షాన నిలబడండి..
## జగన్ 2.0లో మీకే అధిక ప్రాధాన్యం

### మీరు ప్రజల కోసం నిలబడండి.. వారి కోసం కష్టపడండి

- వచ్చే రెండేళ్లు ఎంతో కీలకం.. మీరంతా ప్రజలతో మమేకమవ్వాలి
- మీ అందరి బాధ్యత నాది.. నేను స్వయంగా చూసుకుంటాను
- అన్యాయ పాలన పోతుంది.. వెలుగు వస్తుంది
- జగన్ 2.0లో పార్టీ కార్యకర్తలకు అత్యధిక ప్రాధాన్యం
- ఏజెన్సీలో విద్య, వైద్యానికి పెద్దపీట.. భూములపై హక్కుల కల్పన

అమరావతి: ఇంకా మూడేళ్లు. చివరి ఏడాది



ఎన్నికల ఏడాది కాబట్టి. ఈ రెండేళ్లు చాలా ముఖ్యం. ఈ కాలంలో పార్టీని మోయాల్సిన బాధ్యత, బాధితులైన ప్రజల పక్షాన పార్టీ తరఫున నిలబడాల్సిన బాధ్యత మీ అందరి భుజస్కంధాలపై ఉందని మర్చిపోవద్దు. మీ అందరికీ నేను చెప్పేది ఒక్కటే. మిగతా 2 లో

## 30న మధిరలో రైతు సమ్మేళనం సభ..
# రైతుభరోసా విడుదల

- కేంద్ర ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తోంది
- కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకే ఈ నిర్ణయం
- ఈ ఏడాది ఏడు రకాల సన్నాలకు మాత్రమే బోనస్
- ఎల్‌నినో ప్రభావం తీవ్రమవుతోంది.. తొందరపడి విత్తనాలు వేయొద్దు
- 21న నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం



హైదరాబాద్: వానాకాలం పంటలకు రైతులకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా నిధులను విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రుల సమావేశం నిర్ణయించింది. ఈ నెల 30వ తేదీన ఖమ్మం జిల్లా మధిరలో పెద్దఎత్తున రైతుల సమ్మేళనం నిర్వహించాలని మిగతా 2 లో

# 30న మధిరలో రైతు సమ్మేళనం సభ..రైతుభరోసా విడుదల

మొదటి పేజి తరువాయి

ఈ నెల 30వ తేదీన ఖమ్మం జిల్లా మధిరలో పెద్దఎత్తున రైతుల సమ్మేళనం నిర్వహించాలని తీర్మానించింది. రైతుల సమ్మేళనం సందర్భంగా అదే వేదికగా రైతు భరోసా నిధులను విడుదల చేసి రైతుల ఖాతాలో జమ చేసే ప్రక్రియను ప్రారంభిస్తారు. సన్న ధాన్యానికి సంబంధించి ఏడు రకాల సన్నాలకు బోనస్ చెల్లించాలని నిర్ణయించారు. మార్కెట్‌లో ఉన్న డిమాండ్, ప్రజల వినియోగం, అధిక దిగుబడి వంటి అనేక అంశాలను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం బీపీటీ -5204, ఆర్ఎన్ఆర్ -15048, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కేఎన్ఎం-1638, డబ్ల్యూజీఎల్-44, కేఎన్ఎం-7715.. ఏడు రకాల సన్నాలకు బోనస్ వర్తిస్తుంది. రాష్ట్రంలో రైతులు ఈ ఏడాది దేశంలోనే రికార్డు స్థాయిలో అత్యధిక ధాన్యం పండించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సీజన్‌లో ప్రభుత్వం రికార్డు స్థాయిలో ఇప్పటికే దాదాపు 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. సమావేశం అనంతరం మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, తుమ్మల నాగేశ్వర రావు గారు, ధనసరి అనసూయ సీతక్క గార్లు మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. మిగతా రాష్ట్రాలతో పోలిస్తే కేంద్ర ప్రభుత్వం తెలంగాణ నుంచి తక్కువ ధాన్యాన్ని సేకరించటంపై మంత్రుల సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్రంలో పండించిన మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. కేంద్రం నిర్ణయించిన విధి విధానాల ప్రకారం రాష్ట్రంలో పంట ఉత్పత్తులను కొనుగోలు చేయటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. భవిష్యత్తులో కూడా రైతులకు ఇబ్బంది లేకుండా పంట ఉత్పత్తుల కొనుగోలుకు కేంద్రం నిర్దేశించిన కోటాను అనుసరించాలని సమావేశం భావించినట్టు మంత్రులు తెలిపారు. వానాకాలం సీజన్ కు రాష్ట్రానికి కేటాయించిన ఎరువుల కోటాను వెంటనే విడుదల చేయాలని సమావేశం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. రైతులు ఇబ్బంది పడకుండా ఎరువుల కోటాను విడుదల చేయాలని ఇప్పటికే పలుమార్లు కేంద్రానికి లేఖలు రాశారు. వెంటనే ఎరువుల కోటాను విడుదల చేయాలని కోరుతూ త్వరలో ఢిల్లీకి వెళ్లి మరోసారి కేంద్రాన్ని విజ్ఞప్తి చేయాలని నిర్ణయించారు.

తెలంగాణలోని రామగుండం ఫర్టిలైజర్ కార్పొరేషన్ కంపెనీలో ఉత్పత్తి అవుతున్న యూరియాలో అత్యధిక కోటా రాష్ట్రానికే కేటాయించాలని సమావేశం డిమాండ్ చేసింది. ఇక్కడి నుంచి మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు పంపించకుండా తెలంగాణ యూరియాను కేటాయిస్తే రవాణా ఖర్చులు కూడా తగ్గుతాయని సమావేశం అభిప్రాయపడింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చి కొత్తగా కేంద్రం తెచ్చిన వీబీజీ రామ్ జీ పథకాన్ని కాకుండా పాత ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని సమావేశం తీర్మానించినట్టు మంత్రులు పేర్కొన్నారు. కొత్త చట్టం అమలుతో కూలీలపైనా, రాష్ట్ర ప్రభుత్వంపై పడే ప్రభావాన్ని సమగ్రంగా అధ్యయనం చేయడానికి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, తుమ్మల నాగేశ్వరరావు గారు, సీతక్క గారు, వివేక్ వెంకటస్వామి గారి ఆధ్వర్యంలో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశారు.

మెట్రో ఫేజ్ -2 విస్తరణకు అవసరమైన అనుమతులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం. ఐఆర్ఎఫ్‌సీ నుంచి ఒప్పందం ప్రకారం రావలసిన రుణాన్ని వెంటనే మంజూరు చేయించాలని సమావేశం కోరింది. హైదరాబాద్ ట్రాఫిక్, ప్రయాణికుల అవసరాల దృష్ట్యా మెట్రో ఫేజ్ - 2 విస్తరణ అత్యంత కీలకం. అందుకే మన రాష్ట్రం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలందరూ కూడా మెట్రో విస్తరణకు సహకరించాలని కోరుతున్నాం. ఈ నెల 21న జాతీయ స్థాయిలో జరిగే నీట్ పరీక్షకు రాష్ట్రంలో దాదాపు 208 పరీక్ష కేంద్రాల్లో 2 లక్షల 95 వేల మంది విద్యార్థులు హాజరవుతున్న నేపథ్యంలో పరీక్షకు హాజరయ్యే విద్యార్థులందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని సమావేశం నిర్ణయించినట్టు మంత్రులు తెలిపారు.

# పేదల పక్షాన నిలబడండి.. జగన్ 2.0లో మీకే అధిక ప్రాధాన్యం

మీ అందరికీ నేను చెప్పేది ఒక్కటే. రేపు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ 2.0లో కార్యకర్తలను బాగా చూసుకుంటాను. గత పాలనలో మన కార్యకర్తలను అంత బాగా చూసి ఉండకపోవచ్చు. మనం రాగానే కోవిడ్ రావడంతో, రెండేళ్లు పరిపాలన మీదే ఎక్కువ దృష్టి పెట్టాల్సి వచ్చింది. కానీ, ఈసారి అలా ఉండదు. ప్రతి సంక్షేమ కార్యక్రమం కూడా మీ ఆధ్వర్యంలోనే, మీ చేతుల మీదుగానే అందిస్తాం. మీ అందరికీ నా విజ్ఞప్తి ఒక్కటే. మీరు పేదలకు అండగా, తోడుగా ఉండండి. అది మాత్రమే మిమ్మల్ని కోరుతున్నాను. మిగతా అన్ని విషయాల్లో మీకు తోడుగా నేనుంటాను' అని వైఎస్ జగన్ భరోసా ఇచ్చారు. పోలవరం ముంపు ప్రాంతాల్లో పరిహారం చెల్లింపుల్లో వివక్ష కొనసాగుతోందని సమావేశంలో కార్యకర్తలు ప్రస్తావించగా, దీనిపై పార్టీ తరఫున పోరాడుతామని వైఎస్ జగన్ స్పష్టం చేశారు. నిర్వాసితులు తమ పార్టీలో చేరితేనే పరిహారం ఇస్తామని చెబుతున్నారని జగన్ దృష్టికి తీసుకొచ్చారు. వీటన్నింటిపై పోరాటం కొనసాగిస్తామని, అయినా న్యాయం జరగకపోతే, మనం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేద్దామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రంపచోడవరం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇంఛార్జ్ నాగులాపల్లి ధనలక్ష్మితో పాటు, పార్టీకి చెందిన స్థానిక మాజీ సర్పంచ్‌లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ' 'ఈ రోజు రాష్ట్రంలో ఉన్న పరిస్థితి నాకన్నా మీకే బాగా తెలుసు. చూస్తుండగానే రెండేళ్లు గడిచాయి. ఈ రెండేళ్ల పాలన ప్రతి ఇంట్లో చర్చనీయాంశంగా మారింది. ఇంతకు ముందు జగన్‌ను చూశాం.. ఆయన ఐదేళ్ల పాలన చూశామని, ఆ పాలనకు, ఇప్పుడు చంద్రబాబు రెండేళ్ల పాలనకు మధ్య తేడా ఏమిటనేది ప్రతి ఇంట్లో చర్చించుకుంటున్నారు. మన ఐదేళ్ల పాలనలో గతంలో ఎప్పుడూ చూడని, ఎప్పుడూ జరగని విధంగా పాలన అందించామని గర్వంగా చెబుతున్నా. ' మనం రాక ముందు వరకు మేనిఫెస్టో అంటే ఏ మాత్రం విలువ ఉండేది కాదు. ప్రజలకు ఎన్నెన్నో చేస్తామని ఎన్నికల్లో మాట చెప్పి, ఆ తర్వాత దాన్ని చెత్తబుట్టలో వేసేవారు. అదే మనం వచ్చాక, తొలిసారిగా మేనిఫెస్టోను ఒక భగవద్గీత, ఖురాన్, బైబిల్‌లా భావించి, 99 శాతం అమలు చేసిన పార్టీ ఒక్క మన వైఎస్సార్‌సీపీ మాత్రమే. బడ్జెట్ సమావేశాలకు ముందే పథకాలు, తేదీలు ప్రకటించి, క్రమం తప్పకుండా అమలు చేసింది కేవలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రమే. గతంలో ఎప్పుడూ కనీవినీ ఎరుగని విధంగా పరిపాలనలో మార్పులు కూడా చేశాం. ' మనం రాకముందు స్కూళ్లు ఎలా ఉండేవి? మనం వచ్చిన తర్వాత ఎలా మారాయి?.. అనేది నాకన్నా మీరు బాగా చెప్పగలుగుతారు. మనం రాక ముందు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ అమలు ఎలా ఉండేది? మనం వచ్చాక ఆరోగ్యశ్రీని ఎంత బాగా అమలు చేశాం.. అనేది మీరే బాగా చెప్పగలరు. మనం రాక ముందు వ్యవసాయం ఎలా ఉండేది? రైతులు ఎన్ని ఇబ్బందులు పడ్డారు.. మనం వచ్చిన తర్వాత రైతన్న ఎలా బాగుపడ్డాడు.. వ్యవసాయంలో ఎలాంటి మార్పులు వచ్చాయన్నది మీరే బాగా చెప్పగలరు. మనం రాక ముందు గ్రామాల్లో ఏ పథకం అందక, పరిపాలన అందక, దేనికైనా ఎవరెవరికో డబ్బు ఇవ్వాల్సిన పరిస్థితి. అదే మన వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక, పాలన ఎలా మారింది? గ్రామ స్థాయిలో ప్రభుత్వ సేవలు ఎలా అందాయి? అన్నీ చేసి చూపించాం. ' సచివాలయాల వ్యవస్థ.. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్. ఇంటి గడప వద్దే ప్రభుత్వ పథకాలు అందాయి. ఇన్ని గొప్ప మార్పులు తీసుకురాగలిగాం. విద్య, వ్యవసాయం, వైద్య రంగంలో పెను మార్పులు తీసుకొచ్చాం. దిశ యాప్‌తో మహిళలకు రక్షణ కల్పించాం. వారికి తోడుగా నిలబడ్డాం. ప్రతి గ్రామంలో ఒక మహిళా కానిస్టేబుల్‌ను సచివాలయంలో ఉంచాం. 'వచ్చే రెండేళ్లు పార్టీకి ఎంతో కీలకమైన సమయం.. పార్టీలో ప్రతి ఒక్కరూ నిత్యం ప్రజలతో మమేకం కావాలి.. మీరు ప్రజల కోసం నిలబడండి.. వారి కోసం కష్టపడండి.. మీ అందరి బాధ్యత నాది. నేను స్వయంగా చూసుకుంటాను.. జగన్ 2.0లో పార్టీ కార్యకర్తలకు అత్యధిక ప్రాధాన్యం ఉంటుంది.. అన్ని కార్యక్రమాలు వారి చేతుల మీదుగానే కొనసాగిస్తాం' అని పునరుద్ఘాటించారు. నియోజకవర్గాల వారీగా పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమవుతోన్న వైఎస్ జగన్.. ఆ దిశలో భాగంగా గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో రంపచోడవరం నియోజకవర్గంలో పార్టీకి చెందిన స్థానిక సంస్థల మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, ముఖ్య కార్యకర్తలతో భేటీ అయ్యారు. కార్యకర్తలు, నాయకులను ప్రతి ఒక్కరిని వ్యక్తిగతంగా పలకరిస్తూ ఆప్యాయంగా మాట్లాడారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, జరుగుతున్న పరిణామాలను వివరిస్తూ.. పార్టీని మరింతగా బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.

## మేకెదాటు డ్యామ్ కు వ్యతిరేకంగా తమిళనాడు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం

జరుపుతున్న ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈ ఉదయం తమిళనాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి విజయ్ ఒక కీలక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానానికి అధికార పక్షంతో పాటు కాంగ్రెస్, వీసీకే, ఇతర రాజకీయ పక్షాలు పూర్తి మద్దతు ప్రకటించడంతో అసెంబ్లీ దీనిని ఏకగ్రీవంగా ఆమోదించింది. అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సందర్భంగా విజయ్ మాట్లాడుతూ... కర్ణాటక ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న మేకెదాటు ప్రాజెక్ట్ చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ కావేరి నదీ జలాల వివాదాల ట్రిబ్యునల్ ఇచ్చిన తుది అవార్డుతో పాటు, ఈ విషయమై గతంలో దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను పూర్తిగా ఉల్లంఘిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ డ్యామ్ నిర్మాణం గనుక చేపడితే దిగువన ఉన్న తమిళనాడులోని కావేరి డెల్టా పరివాహక ప్రాంత రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని, వారి జీవనాధారం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి, కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎలాంటి పర్యావరణ, సాంకేతిక అనుమతులు మంజూరు చేయకూడదని తీర్మానం ద్వారా డిమాండ్ చేశారు. ఈ అసెంబ్లీ తీర్మానానికి ముందే, గత నెలలో విజయ్ ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. మేకెదాటు వద్ద డ్యామ్ నిర్మాణాన్ని తక్షణమే అడ్డుకోవాలని కోరుతూ ఆయనకు ఒక సమగ్ర వినతి పత్రాన్ని సమర్పించారు. కావేరి నదీ జలాల నిర్వాహక మండలిలో సభ్యులుగా ఉన్న ఇతర బేసిన్ రాష్ట్రాల (తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి) రాతపూర్వక అనుమతి, ఆమోదం లేకుండా కర్ణాటక ఏకపక్షంగా మేకెదాటు ప్రాజెక్టును చేపట్టడానికి వీల్లేదని విజయ్ ప్రధానికి వివరించారు. ఈ విషయమై కర్ణాటకకు ఎలాంటి అనుమతులు ఇవ్వవద్దని కేంద్ర జలశక్తి శాఖకు, కేంద్ర నీటి వనరుల శాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని ఆయన ప్రధాని మోదీని అభ్యర్థించారు. తమిళనాడు సెంటిమెంట్‌తో ముడిపడి ఉన్న ఈ సున్నితమైన అంశంపై అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేయడంతో ఇప్పుడు బంతి కేంద్ర ప్రభుత్వం పరిధిలోకి వెళ్లింది.

# రాష్ట్రాన్ని పారిశ్రామిక, తయారీ హబ్‌గా మార్చడమే లక్ష్యం



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామిక, తయారీ రంగ కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, ఇందుకు పారిశ్రామికవేత్తలు సహకరించాలని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ఆయన కోల్‌కతాలో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలతో సమావేశమై రాష్ట్రంలో ఉన్న అవకాశాలను వివరించారు. కోల్‌కతాలో వీసా స్టీల్ వైస్ చైర్మన్ విశాల్ అగర్వాల్, ఇమామీ గ్రూప్ డైరెక్టర్ ఆదిత్య ఆగర్వాల్, శ్రీ సిమెంట్స్ వైస్ చైర్మన్ ప్రశాంత్ బంగూర్‌లతో లోకేశ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక సంస్కరణలు దేశాభివృద్ధికి దోహదపడుతున్నాయని ప్రశంసించారు. దీనికి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి కల్పన కోసం వ్యూహాత్మక విధానాలను అమలు చేస్తున్నామని తెలిపారు. తూర్పు తీరంలో ఆంధ్రప్రదేశ్ కీలక ఆర్థిక భాగస్వామిగా ఎదుగుతోందని లోకేశ్ పేర్కొన్నారు. రాష్ట్రానికి ఉన్న విస్తారమైన తీరప్రాంతం, ప్రపంచ స్థాయి ఓడరేవులు, మెరుగైన లాజిస్టిక్స్, పరిశ్రమలకు అవసరమైన భూమి, నిరంతర విద్యుత్ లభ్యత వంటి అంశాలు పెట్టుబడులకు అత్యంత అనుకూలంగా ఉన్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఇన్వెస్టర్-ఫ్రెండ్లీ పాలసీలు పరిశ్రమల స్థాపనను సులభతరం చేస్తున్నాయని తెలిపారు. దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక పెట్టుబడులలో ఒకటైన 'ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్' ప్లాంట్ పనులు అనకాపల్లి వద్ద ఇప్పటికే ప్రారంభమయ్యాయని, దీంతో రాష్ట్రం ఉక్కు పరిశ్రమకు ప్రధాన కేంద్రంగా మారుతోందని ఉదహరించారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలు జాతీయ ఆర్థిక ధోరణులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రభుత్వ-పరిశ్రమల సహకారం వంటి అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. పెట్టుబడులను ఆకర్షించడంలో, పారిశ్రామిక వృద్ధిని ప్రోత్సహించడంలో ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న చురుకైన విధానాన్ని వారు అభినందించారు. రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్న లోకేశ్ విజ్ఞప్తికి వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.

# వచ్చే ఎన్నికల్లోనూ నిన్ను వెంటాడి మరీ ఓడిస్తాం"

మొదటి పేజి తరువాయి



అధినేత్రి కల్వకుంట్ల కవిత అత్యంత ఘాటు వ్యాఖ్యలు చేశారు. "కార్మికులకు, మాకు మధ్య రావాలని చూస్తే ఖబర్దార్. గతంలో చేసిన తప్పులకే నిన్ను వెంటబడి ఓడించాం. మళ్లీ అదే పునరావృతమైతే వచ్చే ఎన్నికల్లోనూ నిన్ను వెంటాడి మరీ ఓడిస్తాం" అంటూ మంత్రి శ్రీధర్ బాబుకు ఆమె మాస్ వార్నింగ్ ఇచ్చారు. బాయిబాట కార్యక్రమంలో భాగంగా కల్వకుంట్ల కవిత అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్టు అండర్‌గ్రౌండ్ మైన్‌లోకి దిగి కార్మికులతో ముఖాముఖి మాట్లాడారు. నల్లబొగ్గు బావుల్లో కార్మికులు పడుతున్న కష్టాలను, ప్రాణసంకట పరిస్థితులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒక కార్మికుడు తను అనుభవిస్తున్న ఇబ్బందులను వివరిస్తుండగా కవిత తీవ్ర చలనానికి లోనై మైన్ లోపలే కంటతడి పెట్టారు. కార్మికులకు తాము ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని, హక్కుల సాధన కోసం పోరాడుతామని భరోసానిచ్చారు. అనంతరం బొగ్గు గని వద్ద నిర్వహించిన భారీ గేట్ మీటింగ్‌లో కవిత మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై, సింగరేణి యాజమాన్యంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉత్తర తెలంగాణకు ఆర్థిక వెన్నెముకగా నిలిచిన సింగరేణి సంస్థకు ప్రస్తుత ప్రభుత్వమే పెద్ద విద్రోహిగా మారిందని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి దాదాపు రూ. 50 వేల కోట్ల బకాయిలు పెట్టడం వల్లే సంస్థ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిందని ఆరోపించారు. అధికారులకు ప్రొడక్షన్ టార్గెట్లు పెంచడంపై ఉన్న శ్రద్ధ... కార్మికులకు కనీస సౌకర్యాలు, ఆధునిక పనిముట్లు కల్పించడంపై లేదని మండిపడ్డారు. "అండర్‌గ్రౌండ్ మైనింగ్‌లో మెషినరీని అప్‌గ్రేడ్ చేయడం లేదు. మ్యాన్ చైర్ మీద 45 నిమిషాల పాటు ప్రయాణించడం వల్ల కార్మికులు తీవ్రమైన వెన్నునొప్పితో బాధపడుతున్నారు. సింగరేణిలో ఇప్పటికీ బ్రిటిష్ కాలం నాటి దోపిడీ వ్యవస్థ నడుస్తోంది. జేఎంఇటీ లో ఉన్న వారికి తొమ్మిదేళ్లు గడుస్తున్నా ప్రమోషన్లు ఇవ్వకుండా అధికారులు వేధిస్తున్నారు" అని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను సింగరేణి కార్మికులను కలవకుండా ఉండేందుకు గత నాలుగు రోజులుగా పోలీసులు ఆంక్షలు పెడుతూ అడ్డుకుంటున్నారని కవిత ఆరోపించారు. అసలు సింగరేణి పరిధిలోకి పోలీసులకు అనుమతే లేదని, గేట్ మీటింగ్‌కు వస్తే కార్మికుల జీతాలు కట్ చేస్తామని యాజమాన్యం బెదిరించడం దుర్మార్గమన్నారు. ఒక్క కార్మికుడి జీతం కట్ చేసినా తాను ఇక్కడే గని ముందే ధర్నాకు కూర్చుంటానని హెచ్చరించారు. రాబోయే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో హెచ్ఎంఎస్ (సమీా) ను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

# పాకిస్థాన్‌లో బాలల బతుకు ఛిద్రం.. ప్రమాదకర పనుల్లో 66 లక్షల మంది చిన్నారులు

ఢిల్లీ: పాకిస్థాన్‌లో బాల కార్మిక వ్యవస్థ అత్యంత ప్రమాదకర స్థాయిలో ఉన్నట్లు తాజా నివేదిక ఒకటి వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఏకంగా 86 లక్షల మంది చిన్నారులు బాల కార్మికులుగా మగ్గుతుండగా, వారిలో 66 లక్షల మంది ఆరోగ్యం, భద్రత, భవిష్యత్తుకు ముప్పు కలిగించే ప్రమాదకర పనుల్లో ఉన్నారని తేలింది. పాకిస్థాన్ జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌సీహెచ్ఆర్), ఐక్యరాజ్యసమితి చిన్నారుల నిధి (యునిసెఫ్) సంయుక్తంగా ఈ సర్వేను నిర్వహించి నివేదికను విడుదల చేశాయి. 'పాకిస్థాన్: చైల్డ్ లేబర్ సర్వేస్, ఎవిడెన్స్ ఫర్ యాక్షన్' పేరుతో విడుదలైన ఈ నివేదిక, దాదాపు 30 ఏళ్లలో ఆ దేశంలో బాల కార్మిక వ్యవస్థపై వెలువడిన తొలి సమగ్రమైన, జాతీయస్థాయి నివేదిక కావడం గమనార్హం. స్థానిక మీడియా సంస్థ 'డాన్' కథనం ప్రకారం.. దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ ప్రమాదకర బాల కార్మిక వ్యవస్థ విస్తరించి ఉందని ఎన్‌సీహెచ్ఆర్ చైర్‌పర్సన్ రబియా జవేరి ఆఘా తెలిపారు. నివేదిక ప్రకారం పంజాబ్ ప్రావిన్స్‌లో అత్యధికంగా 60 లక్షల మందికి పైగా చిన్నారులు బాల కార్మికులుగా ఉండగా.. సింధ్‌లో 16 లక్షలు, ఖైబర్ పఖ్తుంఖ్వాలో 7.45 లక్షలు, బలూచిస్థాన్‌లో 2 లక్షలకు పైగా చిన్నారులు వెట్టిచాకిరిలో మగ్గుతున్నారు. చిన్నారులు బాల కార్మికులుగా మారడానికి పేదరికమే ప్రధాన కారణమని ఈ సర్వే స్పష్టం చేసింది. ముఖ్యంగా నిరుపేద కుటుంబాలు, తల్లిదండ్రులు నిరక్షరాస్యులుగా ఉన్నచోట ఈ సమస్య తీవ్రంగా ఉందని పేర్కొంది. బాలికలతో పోలిస్తే బాలురే ఎక్కువ సంఖ్యలో, ముఖ్యంగా ప్రమాదకరమైన పనుల్లోకి వెళుతున్నారని తేలింది. ఈ వ్యవస్థ చిన్నారుల శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పనిలో ఉన్న పిల్లలు బడికి దూరమవడమే కాకుండా, ఎక్కువ గంటలు పనిచేయడం, తరచూ గాయాల బారిన పడటం, అనారోగ్యంతో బాధపడటం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. వివిధ ప్రావిన్సుల్లో పనిచేస్తున్న చిన్నారుల్లో 32 శాతం నుంచి 58 శాతం వరకు పని సంబంధిత గాయాలు లేదా అనారోగ్యాలతో బాధపడుతున్నట్లు తేలింది. అంతేగాక పనిలో ఉన్న పెద్ద పిల్లల్లో మూడింట ఒక వంతు మంది డిప్రెషన్ లక్షణాలతో బాధపడుతున్నారని నివేదిక హెచ్చరించింది. మరోవైపు బాల కార్మిక నిర్మూలన చట్టాలు ఉన్నప్పటికీ, వాటి అమలు తీరు సంతృప్తికరంగా లేదని సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వారం 'సొసైటీ ఫర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ ది చైల్డ్' (ఎస్‌పీఏఆర్‌సీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆసియా ఆరిఫ్ మాట్లాడుతూ.. ఒక్క ఇస్లామాబాద్‌లోనే ప్రతి నాలుగో ఇంట్లో ఒక బాల కార్మికుడు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరఫరా చైన్‌లు, హోటళ్లు, ఆటోమొబైల్ వర్క్‌షాప్‌లు, ఇటుక బట్టీల వంటి పరిశ్రమల్లో ఈ సమస్య తీవ్రంగా ఉందని ఆమె గుర్తుచేశారు. చట్టాలను కఠినంగా అమలు చేయడం, సామాజిక భద్రత కల్పించడం, నాణ్యమైన విద్యను అందించడం ద్వారానే ఈ సమస్యను పరిష్కరించగలమని సూచించారు. పాకిస్థాన్‌లో ప్రస్తుతం 2.62 కోట్ల మంది చిన్నారులు బడికి దూరంగా ఉన్నారని ఆ దేశ విద్యా మంత్రిత్వ శాఖ ఇటీవల వెల్లడించిన నేపథ్యంలో బాల కార్మిక సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

# భారత్, ఫ్రాన్స్‌ను ఫుట్‌బాల్ కలుపుతోంది

ఢిల్లీ: భారత్, ఫ్రాన్స్ దేశాల మధ్య ఫుట్‌బాల్ క్రీడ ఒక కీలకమైన సాంస్కృతిక వారధిగా నిలుస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. పారిస్‌లో నిర్వహించిన 'బొంజౌర్ మోదీ' కార్యక్రమంలో భాగంగా ప్రవాస భారతీయులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఇరు దేశాల ప్రజలను ఈ క్రీడ ఎంతగానో అనుసంధానిస్తోందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. "భారత్, ఫ్రాన్స్‌లను కలిపే మరో ప్రధానాంశం ఫుట్‌బాల్. ప్రస్తుతం ఫుట్‌బాల్ ఫీవర్ తారాస్థాయికి చేరింది" అని మోదీ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం జరుగుతున్న 2026 ఫిఫా ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శన కనబరుస్తున్న ఫ్రాన్స్ జాతీయ జట్టుకు ఆయన ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. జీ7 సదస్సులో పాల్గొనడంతో పాటు ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే లక్ష్యంతో మోదీ ఫ్రాన్స్‌లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో సాంకేతికత, నూతన ఆవిష్కరణలపై ఆయన ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్‌తో సమావేశమైన ప్రధాని, పలు కీలక అంశాలపై చర్చలు జరిపారు. అలాగే, 'వివాటెక్ 2026' వంటి ప్రతిష్ఠాత్మక సాంకేతిక సదస్సులోనూ ఆయన పాల్గొన్నారు. రక్షణ, సాంకేతికత, సంస్కృతి వంటి కీలక రంగాల్లో భారత్, ఫ్రాన్స్ దేశాల మధ్య ఇప్పటికే బలమైన వ్యూహాత్మక భాగస్వామ్యం ఉంది. ఈ నేపథ్యంలో, క్రీడల ద్వారా కూడా ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలను మరింత సుదృఢం చేయాలనే ఉద్దేశంతో ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది.

# మనకు ఎప్పటికీ ఆయనే స్ఫూర్తి రాహుల్ బర్త్‌డే సందర్భంగా రేవంత్ విషెస్

హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినం. ఏఐసీసీ పిలుపు మేరకు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ శ్రేణులు భారీ ఎత్తున బర్త్‌డే వేడుకలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాహుల్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు పార్టీలకు అతీతంగా రాజకీయ ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీకి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. "మనకు ఎప్పటికీ స్ఫూర్తిదాయక నాయకుడైన రాహుల్ గాంధీ గారికి నా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. భారతదేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడటం, సామాజిక న్యాయం అందించడం, ప్రజా సంక్షేమం పట్ల ఆయన చూపిస్తున్న అచంచలమైన నిబద్ధత కోట్లాది మందికి నిరంతరం కొండంత స్ఫూర్తినిస్తోంది. ఆయన దేశానికి, దేశ ప్రజలకు ఇలాగే తన నిరంతర సేవలను కొనసాగించాలి. రాహుల్ గాంధీ గారు ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో, సంతోషంతో, మరింత శక్తితో వర్ధిల్లాలని నేను మనస్ఫూర్తిగా దేవుడిని కోరుకుంటున్నాను" అంటూ సీఎం రేవంత్ రెడ్డి తన ట్వీట్ లో పేర్కొన్నారు. రాహుల్ గాంధీ బర్త్‌డే సందర్భంగా తెలంగాణవ్యాప్తంగా ఉన్న గాంధీ భవన్ సహా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో కాంగ్రెస్ నాయకులు కేకులు కట్ చేసి స్వీట్లు పంచుతున్నారు. పలు ప్రాంతాల్లో పేదలకు అన్నదానాలు, ఆసుపత్రుల్లో పండ్ల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

# అమెరికానే ఒప్పందం కోసం ఆత్రుత చూపింది

ఢిల్లీ: అమెరికా-ఇరాన్ మధ్య ఇటీవల కుదిరిన అవగాహన ఒప్పందంపై ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ఒప్పందం కోసం అమెరికానే ఎక్కువగా ప్రయత్నించిందని, అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర ఒత్తిళ్లు, వివిధ రకాల దౌత్య ప్రయత్నాలు ఉపయోగించి ఒప్పందాన్ని సాధించారని పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికగా చేసిన ప్రకటనలో ఖమేనీ "అమెరికా అధ్యక్షుడు నిరాశతో అన్ని రకాల ప్రభావాలను ఉపయోగించి ఈ ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు ప్రయత్నించారు. ఇరాన్ అధికారులు నిజాయతీగా చర్చలు జరిపారు. అయితే ఈ ఒప్పందంపై నాకు సూత్రప్రాయంగా భిన్న అభిప్రాయం ఉంది" అని తెలిపారు. అయినప్పటికీ ఇరాన్ ప్రజల హక్కులు, దేశ ప్రయోజనాలు, 'రెసిస్టెన్స్ ఫ్రంట్' ప్రయోజనాలు కాపాడతామన్న హామీతో ఒప్పందానికి అనుమతి ఇచ్చినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో ఒప్పందానికి మించి అమెరికా అదనపు డిమాండ్లు చేయాలని ప్రయత్నిస్తే వాటిని ఇరాన్ అంగీకరించబోదని ఖమేనీ స్పష్టం చేశారు. దేశ ప్రజలు ఓర్పుతో ఉండాలని, ఒప్పందంలో పేర్కొన్న షరతులు అమలవుతాయో లేదో గమనించాలని ఆయన సూచించారు. ఈ ఒప్పందంపై సంతకాలు ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ ఆతిథ్యంలో వెసాయ్ ప్యాలెస్‌లో జరిగిన ప్రత్యేక విందు సందర్భంగా జరిగాయి. జీ7 సదస్సు ముగిసిన అనంతరం ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. మేక్రాన్ ఈ ఒప్పందాన్ని స్వాగతిస్తూ ఇది పశ్చిమాసియాలో శాశ్వత శాంతికి మార్గం సుగమం చేస్తుందని, అలాగే ప్రపంచ ఇంధన సరఫరాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని తిరిగి పూర్తిస్థాయిలో తెరవడానికి సాయపడుతుందని పేర్కొన్నారు.

## ట్రంప్ మాట బేఖాతరు.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు

ఢిల్లీ: ఇరాన్-అమెరికా మధ్య తాజాగా కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన గంటల్లోనే మళ్లీ ఉద్రిక్తతలు మొదలయ్యాయి. లెబనాన్ దక్షిణ ప్రాంతాలపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో కనీసం 16 మంది మరణించినట్లు అక్కడి ప్రభుత్వ వార్తా సంస్థ వెల్లడించింది. దీంతో పశ్చిమాసియాలో పరిస్థితి మళ్లీ ఆందోళనకరంగా మారింది. దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై గురువారం రాత్రి నుంచి దాడులు కొనసాగుతున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. మరోవైపు హెజ్బొల్లా కూడా ఆ ప్రాంతంలో తీవ్ర ఘర్షణ జరుగుతోందని తెలిపింది. ఈ పరిణామం ఇరాన్-అమెరికా మధ్య కుదిరిన తాజా ఒప్పందానికి సవాల్‌గా మారింది. ఆ ఒప్పందం ప్రకారం లెబనాన్‌తో సహా అన్ని ప్రాంతాల్లో సైనిక చర్యలు వెంటనే నిలిపివేయాలి. అలాగే లెబనాన్ సార్వభౌమాధికారాన్ని గౌరవించాల్సి ఉంటుంది. అయితే ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాత్రం వెనక్కి తగ్గేది లేదనే సంకేతాలు ఇచ్చారు. హెజ్బొల్లా నుంచి ముప్పు పూర్తిగా తొలగే వరకు లెబనాన్‌లో సైనిక చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. మరోవైపు ఇరాన్-అమెరికా ప్రతినిధుల మధ్య స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన తదుపరి చర్చలు కూడా వాయిదా పడ్డాయి. శాశ్వత శాంతి ఒప్పందంపై చర్చించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ. వాన్స్.. స్విట్జర్లాండ్ పర్యటనను వాయిదా వేసుకున్నారు. అధికారికంగా సాంకేతిక కారణాలే కారణమని వైట్‌హౌస్ తెలిపింది. కానీ, లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతుండటంతో ఇరాన్ తన ప్రతినిధి బృందాన్ని పంపడంలో జాప్యం చేస్తోందన్న వార్తలు వెలువడ్డాయి. ఇటీవలే అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేశారు. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుతాయన్న ఆశలు వ్యక్తమయ్యాయి. కానీ లెబనాన్‌లో తాజా దాడులతో ఆ ఆశలపై నీళ్లు చల్లినట్లైంది. ఒప్పందం తర్వాత మాట్లాడిన వాన్స్.. ఇజ్రాయెల్‌కు పరోక్ష హెచ్చరిక కూడా చేశారు. ప్రస్తుతం ప్రపంచంలో ఇజ్రాయెల్ పట్ల అత్యంత సానుకూలంగా వ్యవహరిస్తున్న నాయకుడు ట్రంప్ మాత్రమేనని వ్యాఖ్యానించారు.

# గాంధీ సరోవర్‌కు గ్రీన్ సిగ్నల్.. రేవంత్ ధన్యవాదాలు

హైదరాబాద్: గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినందుకు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు, సీఎం రేవంత్ రెడ్డి (శుక్రవారం) కృతజ్ఞతలు తెలిపారు. రక్షణ మంత్రిత్వ శాఖ సహకారానికి తెలంగాణ ప్రభుత్వం తరుపున ధన్యవాదాలని పేర్కొన్నారు. మూసీ పునరుజ్జీవనలో గాంధీ సరోవర్ ప్రాజెక్టు కీలక మైలురాయిగా భావిస్తున్నామని... మూసీ పరివాహక ప్రాంతాన్ని సాంస్కృతిక ప్రజా వారసత్వ ఆస్తిగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తేల్చిచెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా హైదరాబాద్‌లోని బాపూఘాట్ (ఈసీ, మూసీ నదుల సంగమ ప్రాంతం) వద్ద 'గాంధీ సరోవర్' ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా బాపూఘాట్ వద్ద సుమారు 150 మీటర్ల ఎత్తులో మహాత్మా గాంధీ భారీ విగ్రహం, మ్యూజియం, లండన్ ఐ తరహా రాట్నం, సైక్లింగ్ ట్రాక్‌లు, బోటింగ్ సదుపాయంతో పాటు పలు పర్యాటక ఆకర్షణలు అభివృద్ధి చేస్తున్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన డిజైనింగ్, డీపీఆర్ ఇదివరకే సిద్ధమయ్యాయి. తాజాగా పనుల నిర్వహణకు రక్షణ శాఖఅనుమతులు మంజూరు చేసింది. గోల్కొండ ఆర్టిలరీ సెంటర్ పరిధిలోని 83.818 ఎకరాల రక్షణ శాఖ భూమిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ భూమికి ఈ కీలకమైన క్లియరెన్స్ లభించడంతో బాపూఘాట్ వద్ద ప్రాజెక్టు నిర్మాణ పనులు మరింత వేగవంతం కానున్నాయి.

# సంస్కరణల అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ముందంజలో ఉంది

మొదటి పేజి తరువాయి

ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్ అనే మూడు ప్రధాన సూత్రాలను ప్రత్యేకతలుగా చేసుకుని ఆంధ్రప్రదేశ్ ముందుకు సాగుతోందని, ఈ అభివృద్ధి ప్రయాణంలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కోల్‌కతాలోని ఐటీసీ సోనార్ హోటల్‌లో ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) నిర్వహించిన ప్లీనరీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 'ఏపీలో పెట్టుబడులకు గల అవకాశాలు' అనే అంశంపై జరిగిన ఈ సదస్సులో లోకేశ్ తన ప్రసంగంతో పెట్టుబడిదారులను ఆకట్టుకున్నారు.

బెంగాల్ స్ఫూర్తి.. రాష్ట్రాల మధ్య పోటీ అవసరం

ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, "ఈ రోజు బెంగాల్ ఏది ఆలోచిస్తుందో, రేపు భారత్ అదే ఆలోచిస్తుందని చిన్నప్పటి నుంచి వింటూ పెరిగాను. భారతదేశ మేధో, సాంస్కృతిక, ఆర్థిక ప్రయాణానికి కోల్‌కతాయే రాజధానిగా నేను భావిస్తాను. బలమైన బెంగాల్ అంటే బలమైన భారతదేశం అని నేను గట్టిగా నమ్ముతున్నాను" అని అన్నారు. అంతకుముందు రోజు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రితో సమావేశమైన విషయాన్ని గుర్తుచేసుకుంటూ, అభివృద్ధి పట్ల ఆమె అంకితభావం తనకు స్ఫూర్తినిచ్చిందన్నారు. రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉంటేనే దేశం పురోగమిస్తుందని, అదే సమయంలో రాష్ట్రాలు పరస్పరం సహకరించుకుని తమ బలాలను పెంచుకోవాలని అభిప్రాయపడ్డారు. భూమి అనేది భారతీయులకు భావోద్వేగంతో కూడిన అంశమైనప్పటికీ, అమరావతిలో ల్యాండ్ పూలింగ్ ద్వారా రైతులను ఎలా ఒప్పించగలిగామో పశ్చిమబెంగాల్ సీఎంకు వివరించినట్లు తెలిపారు.

ఏపీ పెట్టుబడుల గమ్యస్థానం.. మూడు 'ఎస్' ల మంత్రం

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం స్థిరత్వంతో ముందుకు సాగుతోందని, ఆయన అమలు చేస్తున్న సంస్కరణలను అందిపుచ్చుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ముందు వరుసలో ఉందని లోకేశ్ స్పష్టం చేశారు. దేశానికి వస్తున్న మొత్తం పెట్టుబడులలో 25 శాతం ఏపీకే వస్తున్నాయని గుర్తుచేశారు. పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ విజయానికి మూడు 'ఎస్'లే (ఎస్‌లు) కారణమని వివరించారు. మొదటిది 'స్పీడ్' (వేగం) అని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దశను దాటి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అమలు చేస్తున్నామని తెలిపారు. 13 నెలల్లోనే గూగుల్ వంటి అతిపెద్ద విదేశీ పెట్టుబడిని సాధించడం, ఒకే జూమ్ కాల్‌తో ఆర్సెలార్ మిట్టల్ ప్రాజెక్టును ఖరారు చేయడం, పుట్టపర్తిలో 37 రోజుల్లో 600 ఎకరాలు సేకరించి శంకుస్థాపన చేయడం తమ వేగానికి నిదర్శనమన్నారు. రెండోది 'స్టెబిలిటీ' (స్థిరత్వం) అని, విధానాల్లో స్థిరత్వాన్ని కొనసాగిస్తూ పారిశ్రామికవేత్తలకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. మూడోది 'సర్వీస్' (సేవ) అని, ప్రభుత్వాలను నియంత్రణ సంస్థలుగా కాకుండా సేవలందించే భాగస్వాములుగా తాము భావిస్తామన్నారు. "కస్టమర్ ఈజ్ గాడ్ అనే మార్వాడీల స్ఫూర్తితో మీకు సేవ చేసేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. మీరు మా కస్టమర్లు" అని పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి అన్నారు.

మాకు ఎలాంటి ఇగోలు లేవు

2047 నాటికి ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామని లోకేశ్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉన్న ట్రాక్ రికార్డు, ఆయన దార్శనికతతో ఇది సాధ్యమవుతుందన్నారు. జులైలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్నామని, మంగళగిరిలో జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్క్ నిర్మిస్తామని ప్రకటించారు. ఏపీలో యువశక్తితో కూడిన కొత్త కేబినెట్ ఉందని, తామంతా ఎలాంటి ఇగోలు లేకుండా రాష్ట్ర అభివృద్ధి కోసం కసితో పనిచేస్తున్నామని అన్నారు. "నేను మీకు కేవలం ఒక వాట్సాప్ దూరంలోనే ఉన్నాను. మీ ప్రాజెక్టును మా ప్రాజెక్టుగా భావించి పూర్తిచేస్తాం. మనమంతా కలిసి పనిచేసి, బలమైన రాష్ట్రాల ద్వారా బలమైన భారతదేశాన్ని నిర్మిద్దాం" అని లోకేశ్ తన ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ఐసీసీ ప్రెసిడెంట్ బ్రిజ్ భూషణ్ అగర్వాల్, ఉపాధ్యక్షుడు కేశవ్ భజంక, ఇతర ప్రముఖ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## హోమ్‌స్టేలు, వసతి గృహాలకు సీసీ కెమెరాలు తప్పనిసరి - అనుమతి లేకుంటే చర్యలు: అధికారుల హెచ్చరిక



మంత్రాలయం,శివసూర్య(ప్రతినిధి)జూన్ 19:మంత్రాలయం పరిధిలో హోమ్‌స్టేలు, వసతి గృహాలు నిర్వహించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సీసీ కెమెరాలు అమర్చుకోవాలని, ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. ఈ అంశంపై శుక్రవారం ఎంపీడీవో నూర్జహాన్, ఎమ్మార్వో రమాదేవి, సిఐ దస్తగిరి బాబు, ఎస్ఐ మల్లికార్జున సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ, కొందరు అనుమతి లేకుండా హోమ్‌స్టేలు, వసతి గృహాలు నడుపుతున్నారని, దీనివల్ల శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందని తెలిపారు.సీసీ కెమెరాలు లేకపోతే నేరాలు, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టడం కష్టమవుతుందని అధికారులు వివరించారు. దొంగతనాలు జరిగినా, అనుమానితులు వచ్చి వెళ్లినా గుర్తించే అవకాశం ఉండదని పేర్కొన్నారు. ప్రజల భద్రత దృష్ట్యా అన్ని హోమ్‌స్టేలు, లాడ్జిల నిర్వాహకులు వెంటనే కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతి తీసుకోకుండా, సీసీ కెమెరాలు లేకుండా హోమ్‌స్టేలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

## మాదిగ క్రాంతి ఆత్మహత్యపై సీఎం స్పందించాలి: ఎమ్మార్పీఎస్



మంత్రాలయం,శివసూర్య, జూన్ 19: మాదిగ క్రాంతి ఆత్మహత్యకు కారకుడైన కృష్ణలంక సిఐ నాగరాజును సర్వీస్ నుంచి తొలగించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నేత గుండెపోగుల నేపాల్ డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు వెంటనే స్పందించాలని కోరారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. “మాదిగగా పుట్టడమే నా తప్పా” అని క్రాంతి ఆవేదన చెంది ఆత్మహత్య చేసుకోవడం విషాదమన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అంగన్వాడీలో గ్రాడ్యుయేషన్ డే - 30 మంది చిన్నారులకు ఘన వీడ్కోలు



**మంత్రాలయం,శివసూర్య(ప్రతినిధి)జూన్ 19: మంత్రాలయంలోని అంగన్వాడీ సెంటర్-2లో శుక్రవారం ఘనంగా గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు.**



ప్రైవేట్ పాఠశాలల్లో మాదిరిగానే ప్రభుత్వ అంగన్వాడీల్లోనూ చిన్నారులను ప్రోత్సహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హెచ్ఎం లక్ష్మన్న మాట్లాడుతూ “ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మన ప్రభుత్వ అంగన్వాడీల్లోనూ పిల్లలను ప్రోత్సహిస్తున్నాం. చిన్నారుల్లో ఆత్మవిశ్వాసం పెంచి, వారిని తదుపరి విద్యకు సిద్ధం చేయడమే ఈ గ్రాడ్యుయేషన్ డే ముఖ్య ఉద్దేశం” అని అన్నారు.అనంతరం ఉపాధ్యాయులు దివ్యవాణి, ఫాతిమా ఫర్వీం చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. అంగన్వాడీ టీచర్లు స్వప్న, భీమేశ్వరి, శ్వేత, కళ్యాణి, ప్రమీలమ్మ ఆధ్వర్యంలో అంగన్వాడీలో విద్యనభ్యసించిన 30 మంది చిన్నారులను ఎలిమెంటరీ పాఠశాలకు ప్రమోట్ చేస్తూ ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వ అంగన్వాడీల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. పిల్లలకు మంచి భవిష్యత్తు అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని వారు పేర్కొన్నారు.

## రైతులకు యూరియా పంపిణీ ఖరీఫ్‌లో కొరత లేకుండా చర్యలు




మంత్రాలయం,శివసూర్య(ప్రతినిధి)జూన్ 19: మంత్రాలయం మండలంలోని మాంచాల, కల్లు దేవకుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో శుక్రవారం ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాంచాల సొసైటీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి గణేష్, సొసైటీ డైరెక్టర్లు చాపల నాగేష్, డిసి తిమ్మప్ప పాల్గొని రైతులకు యూరియా బస్తాలను అందజేశారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ “కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతు పక్షపాతిగా ఉంటుంది. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు యూరియా, ఎరువుల కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా పారదర్శకంగా పంపిణీ చేస్తున్నాం” అని తెలిపారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతులకే సబ్సిడీపై యూరియా అందిస్తున్నామని వ్యవసాయ అధికారి గణేష్ వివరించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యూరియా పంపిణీలో ప్రభుత్వం చూపిస్తున్న చొరవ పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## జర్నలిస్టుల పిల్లలకు 50% ఫీజు రాయితీ కల్పించాలి - కలెక్టర్ ఆదేశం, అమలు చేయకుంటే చర్యలు



మంత్రాలయం,శివసూర్య(ప్రతినిధి)జూన్ 19:జిల్లాలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లల ఫీజుల్లో 50 శాతం రాయితీ కల్పించాలని జిల్లా కలెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆప్జాఖఔజీ జిల్లా ఉపాధ్యక్షుడు చాంద్ బాషా, సహాయ కార్యదర్శి బి. హనుమేష్,




మంత్రాలయం నియోజకవర్గ అధ్యక్షుడు జయరాజ్, కార్యదర్శి హుసేని, కోశాధికారి సాబ్ వలి సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టు సంఘాల విజ్ఞప్తి మేరకు కలెక్టర్ ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని వారు వెల్లడించారు.ఈ ఆదేశాలను జిల్లాలోని అన్ని పాఠశాలల యాజమాన్యాలు పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఫీజు రాయితీ అమలుపై ఐజూా, వీజూాలు ప్రత్యేకంగా దృష్టి సారించి పర్యవేక్షించాలని సూచించారు. నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జర్నలిస్టుల సంక్షేమం కోసం కలెక్టర్ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల ఆప్జాఖఔజీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గుతుందని, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామని చాంద్ బాషా పేర్కొన్నారు.

## పొలంలో వర్షపు నీరు చేరడంతో వివాదం... అల్లప్ప పై ముగ్గురు వ్యక్తులు దాడి



పెద్దకడబూరు,శివసూర్య,జూన్ 19: కర్నూలు జిల్లా పెద్దకడబూరు మండల కేంద్రంలోని అల్లప్ప అనే వ్యక్తిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది.బాధితుడు అల్లప్ప, మరియు మా తండ్రి మీద తెలిపిన వివరాల ప్రకారం, తనకు చెందిన భూమి లో వర్షపు నీరు చేరి నిండిపోవడంతో కింద పొలం వారు రంగయ్య ఫ్యామిలీ అడ్డుకట్టు వేసి రాళ్ళు వేయడం జరిగిందన్నారు. వెంటనే మేము పొలానికి వెళ్లి చూడగా అడ్డగడ్డ తొలగించేందుకు ప్రయత్నిస్తుండగా వీర నాగుడు నరసన్న భీమేషు మాపై రక్త గాయాలతో దాడి చేశారని తెలిపారు. మేము పొలం నుంచి గాయపడి పెద్దకడుబూరు పోలీస్ స్టేషన్కు వెళితే అక్కడ ఉన్న హెడ్ కానిస్టేబుల్ మీరు త్వరగా ఎమ్మిగనూరు ప్రభుత్వ హాస్పిటల్ కి వెళ్ళండి మీకు రక్త గాయాలయ్యాయి అని తెలపడంతో మేము వెళ్లి హాస్పిటల్కు అడ్మిట్ కావడం జరిగిందన్నారు. ప్రభుత్వ హాస్పిటల్ లో అడ్మిట్ అయిన తర్వాత మాకు చికిత్స డాక్టర్లు అందించారు. అనంతరం ఎమ్మిగనూరు పోలీస్ స్టేషన్ వారు హెడ్ కానిస్టేబుల్ మా దగ్గరకు వచ్చి విచారణ చేసి జరిగిన విషయాన్ని విచారణ చేసి పెద్దకడబూరు పోలీస్ స్టేషన్ కు విచారణను పంపుతామని తెలిపారు. మాపై దాడి చేసిన వీర నాగుడు , నరసన్న, భీమేష్ ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేయండి అని పోలీస్ స్టేషన్కు వెళితే , పెద్దకడబూరు పోలీసు వారు మీ మీద కేసు నమోదు అయిందని తెలిపారు. ఇదేం న్యాయం సార్ అని అడిగితే, మీ మీద కేసు నమోదు అయిందని అన్నారు. మాపై దాడి చేసిన వారి మీద కేసు నమోదు చేసి మాకు న్యాయం చేయాలని అల్లప్ప తెలిపారు

## మాంచాల గ్రామానికి పి జి ఆర్ ఎస్ నిర్వహణ - మూడు అర్జీలు స్వీకరణ



మంత్రాలయం,శివసూర్య(ప్రతినిధి)జూన్ 19: మంత్రాలయం ఎమ్మార్వో కార్యాలయంలో శుక్రవారం మాంచాల గ్రామానికి ప్రత్యేకంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం మూడు అర్జీలు వచ్చాయని డిప్యూటీ తహశీల్దార్ గురు రాజారావు తెలిపారు.వచ్చిన అర్జీల్లో ఒకటి భూ ఆక్రమణకు సంబంధించినది కాగా, మిగిలిన రెండు కూడా భూ సమస్యలపైనే ఫిర్యాదులు అందాయని ఆయన వివరించారు. మాంచాల గ్రామానికి ప్రతి నెలా 4 శుక్రవారాలు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించాలని నిర్ణయించామని, ఇప్పటికే రెండు శుక్రవారాలు పూర్తయ్యాయని డిప్యూటీ తహశీల్దార్ వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ “భూమి, విద్యుత్, విద్య, ఆరోగ్యం,



రెవెన్యూ తదితర ప్రజా సమస్యలను ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నేరుగా స్వీకరించి సత్వరమే పరిష్కరిస్తాం. ప్రజలు తమ సమస్యలతో నేరుగా వచ్చి అర్జీలు అందజేయవచ్చు” అని సూచించారు. ప్రభుత్వం ప్రజల వద్దకే పాలన అందిస్తోందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## విష్ణు సహస్రనామ పారాయణం చాలీసా డీ.డీ.ఎన్.ఏస్. వికాసతరంగిణి ఆధ్వర్యంలో



జోగులాంబ, శివసూర్య జూన్ 19 గద్వాల జిల్లా అలంపూర్ తాలూకా ఐజ మున్సిపాలిటీ భరత్‌నగర్ కాలనీలో వికాస తరంగిణి సభ్యులు జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు చక్రవర్తి చార్యుల స్వగృహంలో వికాస తరంగిణి, అర్చక సంఘం మరియు హెల్పింగ్ హాండ్స్ సభ్యుల ఆధ్వర్యంలో సామూహికంగా విష్ణు సహస్రనామ పారాయణం, ఆంజనేయ స్వామి దండకం పారాయణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది.ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీమహావిష్ణువు మరియు ఆంజనేయ స్వామి వారి నామస్మరణలో మునిగిపోయారు. ప్రతిరోజూ చక్రవర్తి చార్యుల స్వగృహంతో పాటు శ్రీలేఖ కిరాణం ప్రాంగణంలో కూడా ఆంజనేయ స్వామి దండకం, హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాలు నిరంతరంగా నిర్వహించబడుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా చక్రవర్తి చార్యులు మాట్లాడుతూ, విష్ణు సహస్రనామం, హనుమాన్ చాలీసా మరియు ఆంజనేయ స్వామి దండకం పారాయణం చేయడం వల్ల మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక చైతన్యం, ధైర్యం మరియు దైవానుగ్రహం లభిస్తాయని పేర్కొన్నారు. భక్తులు నిత్యం భగవన్నామ స్మరణ చేయాలని, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని జీవితాన్ని ధన్యంగా మార్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి సభ్యులు, అర్చక సంఘం ప్రతినిధులు, హెల్పింగ్ హాండ్స్ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## నాగర్దొడ్డిలో “మన గుడి” కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు చక్రవర్తి చార్యులు



గద్వాల, శివసూర్య, జూన్ 19: జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని నాగర్దొడ్డి గ్రామంలో నిర్వహించిన “మన గుడి” కార్యక్రమంలో జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు చక్రవర్తి చార్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సనాతన ధర్మ పరిరక్షణ, ఆలయాల ప్రాముఖ్యత, హిందూ సంప్రదాయాల పరిరక్షణ గురించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సభ్యులు, భజన మండలి సభ్యులు, గ్రామ ప్రజలు, అర్చక సంఘం సభ్యులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## ఐజలో సామాజిక సద్భావన సమావేశం -- ప్రతి హిందూ బంధువు పాల్గొనాలి : ఆచార్య చక్రవర్తి చార్యులు



అలంపూర్, శివసూర్య, జూన్ 19: జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ తాలూకా ఐజ మున్సిపాలిటీ పరిధిలోని అంబా భవాని దేవాలయం నందు ఆర్.ఎస్.ఎస్. వి.హెచ్.పీ. ఆధ్వర్యంలో సామాజిక సద్భావన సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు, విశ్వహిందూ పరిషత్ జిల్లా ఆచార్య సంపర్క్ ప్రముఖ్ ఐజ ఆచార్య చక్రవర్తి చార్యులు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమంలో కుల సంఘాల పెద్దలు, హిందూ బంధువులు, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యకర్తలు మరియు ఐజ ప్రాంత సామూహిక సద్భావన టోలి సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.అంబా భవాని దేవాలయం వేదికగా జరగనున్న ఈ సమావేశం సామాజిక ఐక్యత, పరస్పర సౌభ్రాతృత్వం మరియు హిందూ సమాజ సంఘటిత భావనకు దోహదపడుతుందని ఆచార్య చక్రవర్తి చార్యులు పేర్కొన్నారు.

## శుద్ధ పంచమి సందర్భంగా శ్రీ గుంటిరంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు




ఐజ, శివసూర్య జూన్ 19 : జోగులాంబ గద్వాల జిల్లా అల్లంపూర్ తాలూకా ఐజ మున్సిపాలిటీ ఆరవ వార్డు తుపత్రాల గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి గుంటిరంగనాథ స్వామికి అధిక జ్యేష్ఠ మాసం శుద్ధ పంచమి సందర్భంగా శ్రీ ఆంజనేయ స్వామి గుంటిరంగనాథ స్వామికి పట్టణ మరియు గ్రామప్రజలందరూ భక్తిశ్రద్ధలతో కేశవ నామాలతో రామానుజాచార్యఅష్టోత్తర శతనామావళి స్మరించుకొని భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమాలు నిర్వహించి స్వామివారి యొక్క గోవిందం భజగోవిందం హనుమాన్ చాలీసా విష్ణు సహస్ర నామావళి అష్టోత్తరాలు పల్లకి సేవతో ఊరేగింపుగా భక్తాదులందరూ భక్తి ప్రపత్తులతో కార్యక్రమాలు నిర్వహించి భక్తులు స్వామివారికి మొక్కులు తీర్చుకోవడం జరిగింది. అనంతరం స్వామివారికి కాయ కర్పూరాలు తీర్థప్రసాదాలను సమర్పించుకొని మొక్కులను చెల్లించుకుని అనంతరం ఆలయ అర్చకులు ఆచార్య శ్రీ వైష్ణవం చక్రవర్తి చార్యులు భక్తాదులందరికీ ఆశీర్వచనాలు మంగళా శాసనాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకట్రాములు రమేష్ కౌన్సిలర్ మహేశ్వరివెంకన్నగౌడ్ రఘు శంకర్ ఆంజనేయులు వీరేష్ పాండు అమర్ సరస్వతి చిన్నఆంజనేయులు గ్రామ ప్రజలు ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## భగవంతుడికి శరణాగతి కావడమే మానవ జీవిత పరమార్థం : ఆచార్య చక్రవర్తి చార్యులు



గద్వాల్, శివసూర్య, జూన్ 19 :84 లక్షల జీవరాశుల్లో అత్యంత విశిష్టమైన జన్మ మానవ జన్మ అని సద్గురువులు, పురాణాలు, ఇతిహాసాలు తెలియజేస్తున్నాయని జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు ఆచార్య చక్రవర్తి చార్యులు పేర్కొన్నారు.ప్రతి ప్రాణికి లేనటువంటి మేధస్సు, మాట, జ్ఞానం మనిషికి భగవంతుడు ప్రసాదించాడని అన్నారు. భగవంతుడు ఇచ్చిన దానితో తృప్తిపడుతూ, నిరంతరం భగవన్నామ స్మరణ చేస్తూ, మానవ సేవను ఆచరిస్తూ జీవించడమే నిజమైన మానవ ధర్మమని తెలిపారు.భగవంతుడికి శరణాగతి చెంది, సేవా భావంతో జీవిస్తూ, తోటి మానవులకు సహాయం చేయడమే మనిషిగా జన్మించిన ప్రధాన లక్ష్యమని శ్రీ గురు ఓంకార పీఠం సభ్యులు, జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు ఆచార్య చక్రవర్తి చార్యులు వివరించారు.

## నూతన ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా



అదిలాబాద్ జిల్లా జూన్ 19 ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. శుక్రవారం బజారత్నూర్ మండలం గులాబ్ తండాలో 'బాల వికాస ఫౌండేషన్' ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ఆయన రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. అనంతరం ప్లాంట్ పనితీరును, నీటి శుద్ధి ప్రక్రియను స్వయంగా పరిశీలించిన కలెక్టర్, స్థానిక ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ..ప్రజలు కలుషిత నీరు త్రాగడం ద్వారా అనారోగ్యం బారిన పడుతున్నారని, ఆర్వో ప్లాంట్ ద్వారా లభించే శుద్ధి చేసిన నీటిని వినియోగించుకోవడం వల్ల డయేరియా, టైఫాయిడ్ వంటి నీటి ద్వారా సంక్రమించే వ్యాధులను పూర్తిగా అరికట్టవచ్చని, తద్వారా ప్రజల ఆరోగ్యం మెరుగవుతుందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ప్లాంట్ల ఏర్పాటు ఎంత ముఖ్యమో, వాటి నిరంతర నిర్వహణ అంతే ముఖ్యమని అధికారులకు సూచించారు. ప్లాంట్‌లో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా నిరంతరాయంగా ప్రజలకు నీరు అందేలా స్థానిక అధికారులు, గ్రామ పంచాయతీ ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ప్రజలందరూ ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, గ్రామాల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం, విద్యార్థుల భద్రతకు, పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఇందులో భాగంగానే బజారత్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన కాంపౌండ్ గోడను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బాల వికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరిరెడ్డి సింగారెడ్డి, శ్రీలక్ష్మి రెడ్డి, ఎంపీడీఓ మహేందర్ రెడ్డి, సర్పంచ్ రాథోడ్ లక్ష్మి భాయి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణపై సీఈఓ వీడియో కాన్ఫరెన్స్: పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా



అదిలాబాద్ జిల్లా జూన్ 19 -2026 ఓటర్ల జాబితా సవరణ అత్యంత పకడ్బందీగా నిర్వాహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ నుండి జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులకు ' సార్ -2026' ఓటర్ల జాబితా సవరణపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశ నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టరేట్ విసి హాల్ నుండి కలెక్టర్ రాజర్షి షా పాల్గొని జిల్లా నివేదికను వివరిస్తూ, జిల్లాలో ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియకు సంబంధించి బీఎల్ఓ, బీఎల్ఏల శిక్షణ, కిట్ల పంపిణీ ఇప్పటికే పూర్తయిందని వివరించారు. ఎన్యుమరేషన్ ఫారాలను ఇప్పటికే అందించామని, ఈ నెల 23 నాటికి అవి అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఓటర్లలో అవగాహన కోసం జిల్లా, మండల కేంద్రాల్లో హోర్డింగుల ద్వారా విస్తృత ప్రచారం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన కోసం ఏఈఆర్‌ఓలు, ఈఆర్‌ఓలు, డిప్యూటీ డీఈఓలతో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఇంకా మ్యాపింగ్ కాని ఓటర్లను గుర్తించి, మార్పులు-చేర్పులు చేపట్టాలని బీఎల్ఓలను ఆదేశించినట్లు చెప్పారు. ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తామని, ఈ ప్రక్రియలో సహాయం కోసం ఎలాంటి రాజకీయ అనుబంధం లేని స్థానిక వాలంటీర్లను మాత్రమే ఎంపిక చేశామని ఆయన స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రూ, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పల్లపాటి మల్లమ్మ మృతికి బీఆర్ఎస్ నాయకుల ఘన నీవాళ్లు





ఖమ్మం జిల్లా కారేపల్లి : జూన్ 19 : మండలం గిద్దవారిగూడెం గ్రామానికి చెందిన పల్లపాటి మల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు బానోత్ మనీషా లక్ష్మి మదన్‌లాల్ ఆమె పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి , వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పల్లపాటి మల్లమ్మ మృతి గ్రామానికి తీరని లోటని పేర్కొంటూ , ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని దేవుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు , బీఆర్ఎస్ నాయకులు , కార్యకర్తలు పాల్గొని మల్లమ్మకు నివాళులర్పించారు.

## అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు బెంచీల వితరణ: ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా

అదిలాబాద్ జిల్లా జూన్ 19 )శుక్రవారం పట్టణంలోని బాలాజీనగర్ లోని అర్బన్ రెసిడెన్షియల్



పాఠశాల విద్యార్థులకు బాలవికాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా అందజేసిన బెంచీల వితరణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా ముఖ్య అతిథిగా హాజరై తరగతి గదులను రిబ్బన్ కట్ చేసి అధికారికంగా ప్రారంభించారు. పాఠశాలలోని సుమారు 120 మంది విద్యార్థులకు సరిపడా బెంచీలను స్టోన్ హై స్కూల్ మేనేజ్మెంట్ ఆర్థిక సహకారంతో (ఫండింగ్) బాలవికాస్ సంస్థ ఈ బడికి గిఫ్ట్‌గా అందజేసింది. పేద విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి మాధవి, బాలవికాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి. లక్ష్మి రెడ్డి గారు, సంస్థ డైరెక్టర్ సైదిరెడ్డి, వివిధ సెక్టార్ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## కారేపల్లి మండలంలో మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ విస్తృత పర్యటన

### నేనున్నా ఆధైర్య పడకండి - పలు కుటుంబాలకు పరామర్శ



ఖమ్మం జిల్లా, కారేపల్లి :జూన్ 19 : మండలంలో వైరా మాజీ శాసనసభ్యులు లావుడియా రాములు నాయక్ గారు శుక్రవారం విస్తృతంగా పర్యటించారు . భాగ్యనగర్ తండా గ్రామానికి చెందిన మండల నాయకులు భూక్య రాంకిషోర్ గారి అన్న భూక్య కిషన్ 11వ వార్డు మెంబర్ కుమారుడుకి ఇటీవల కారు ప్రమాదంలో గాయాలవ్వడంతో వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అంతకు ముందు మండల కేంద్రంలోని తాటి బెల్లం టి స్టాల్ ను సందర్శించి ప్రొప్రేటర్ హాట్కర్ శ్రీను అభినందించారు. అనంతరం ఆల్య తండా గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు దారవత్ రాంజీ గారి తండ్రి హరిసింగ్ గురువారం మరణించడంతో వారి కుటుంబ సభ్యులు పరామర్శించి , ప్రగాఢ సానుభూతి తెలిపారు. గుట్టకింద గుంపు మాజీ ఉపసర్పంచ్ గౌస్ పాషా ఉషా తండ్రి షేక్ సైదా అనారోగ్యంతో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న వారి ఇంటికి వెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంట మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ , మాజీ జడ్పీటీసీ ఉన్నం వీరేందర్ , మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు , మండల నాయకులు అజ్మీర వీరన్న , వాంకుడొత్ నరేష్ , ఏన్కూరు మండల మాజీ అధ్యక్షుడు బాణోత్ సురేష్ , నాయకులు గుగులోత్ హారు , బాణోత్ కోటి , వాంకుడొత్ కరణ్ సింగ్ , వాంకుడొత్ సతీష్ , గుగులోత్ సురేష్ , జాల సాంబ , 8వ వార్డు సభ్యులు గుగులోత్ నాగేశ్వరరావు , దస్తగిరి , మన్సూర్ , ఖలీల్ , సర్వర్ , స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ నిర్మాణంలో దాతల సహకారం మరువలేనిది. కోరని బాల్ రాజ్, యాదయ్య.



రాజేంద్ర నగర్ :బుద్వేల్ లోని ఈదమ్మ, పోచమ్మ దేవాలయ నిర్మాణం లో దాతల సహకారం మరువలేనిదని అలయ నిర్మాణ కర్తలు కోరని బాల్ రాజ్, ఈ. యాదయ్యలు అన్నారు. ఎంతో చరిత్రాత్మకమైన ఈ దేవాలయం పునర్నిర్మాణం చేస్తున్నామని, ఇందుకు గాను నిధులను సమాకుర్చుటలో దాతల సహకారం ఎంతో అవసరముందన్నారు. ఇప్పటి వరకు ఆలయ కమిటీ సభ్యులు, స్థానికుల సమిష్టి కృషితో ఆలయ నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ ఆలయం పూర్తి స్థాయిలో నిర్మాణం కావాలంటే మరిన్ని నిధులు అవసరమున్నాయన్నారు. ఇప్పటికే భక్తులు నిత్య పూజలు చేస్తున్నారని తెలిపారు. ఈ ఆలయ నిర్మాణం కోసం గగన్ పహాడ్ కు చెందిన లలిత్ వర్రీ సుమారు రూ. 5 లక్షల విలువైన ఇసుక ప్రధానం చేశారు. ఈ సందర్భంగా లలిత్ వర్రీ కి ఆలయ కమిటీ తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాగేందర్ రెడ్డి, రూపేష్ రెడ్డి, కోరని కుమార్, పి. వెంకటేష్, గుంటి శోభ, కే. చైతన్య కుమార్, ఎం హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



నారాయణపేట జూన్ 19 :మక్తల్ పట్టణంలో శుక్రవారం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వ హించారు. రాష్ట్ర క్రీడా,పాడి పరిశ్రమాభివృద్ధి,పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి. మక్తల్ లోని మంత్రి క్యాంపు కార్యాలయం లో కాంగ్రెస్ నాయకులు, అభి మానుల మధ్య కేక్ కట్ చేసి రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో కులాలు మతాల పేరుతో విడగొడుతున్న తరుణంలో రాహుల్ గాంధీ కన్యాకు మారి నుండి కాశ్మీర్ దాకా 4200 కిలోమీటర్ లు నడిచి భారత్ జోడోయాత్ర ద్వారా దేశ వ్యాప్తంగా ప్రజల ఐక్యత కు కృషి చేశారన్నారు. మనమేంతో మనకంత అనే నినాదంతో జిత్నే అబాది హే ఉత్నే ఇసెదరి మిల్నా చాహి యే అని దేశవ్యాప్తంగా బల హీన వర్గాల ప్రజలకు న్యాయం జరగాలనే ఉద్దేశ్యం తో రాష్ట్రం లో కుల గణన చేశామని తెలిపారు. చట్ట సభల్లో ఇంకా అడుగుపెట్టని వెనకబడిన జాతులు ఉన్నాయని, వారి వెనకబాటు తనం పోగొట్టి వారిని అన్ని రంగాల్లో ఉన్నత స్థాయి కి తెచ్చే విధంగా రాహుల్ గాంధీ కృషి చేస్తున్నారని తెలిపారు. రాహుల్ గాంధీ జన్మదిన సందర్భంగా వారికి ఆ భగవంతుడు అన్ని రకాలుగా శక్తిని ఇవ్వాలని మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు. ఈ కార్య క్రమంలో మక్తల్ నియోజ కవర్గ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్యక ర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఖమ్మం ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



ఖమ్మం ప్ర జాస్వామ్య విలువలను కాపాడేందుకు పోరాడుతున్న గొప్ప నేత అని కొనియాడిన ఎంపీ రఘురాం రెడ్డి పార్టీ శ్రేణుల నడుమ కేక్ కటింగ్ ఖమ్మంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినోత్సవ వేడుకలను శుక్రవారం ఖమ్మం లోని గట్టయ్య సెంటర్ లో గల ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి హాజరై.. కాంగ్రెస్ పార్టీ శ్రేణుల నడుమ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు, సామాజిక న్యాయం అందించేందుకు రాహుల్ గాంధీ నిబద్ధతతో ముందుకు సాగుతున్నారని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రధానిగా చూడాలనేది ప్రజల ఆకాంక్ష అని, భవిష్యత్తులో ఇది సాకారం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు దీపక్ చౌదరి, సీనియర్ నాయకులు మిక్కిలినేని నరేంద్ర, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యడ్లపల్లి సంతోష్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, ప్రతిభా రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్, టీపీసీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ భాయ్, నాయకులు కిరణ్ నాయక్, మేడా వెంకట్రావ్, క్రాంతి, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు ఓటు హక్కును కాపాడుకోవడం మనందరి బాధ్యత మంత్రి శ్రీహరి




నారాయణపేట జూన్ 19 :ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని దానిని కాపాడుకోవడం అందరి బాధ్యత అని రాష్ట్ర పాడి పరిశ్రమ, యువజన క్రీడలు, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గం లోని 7 మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, బూత్ లెవెల్ ఏజెంట్లతో ఓటరు సవరణ ప్రక్రియ పై అవగాహన శిక్షణా శిబిరం నిర్వహించారు. మక్తల్ కాంగ్రెస్ పార్టీ కార్యా లయంలో నిర్వహించిన ఈ సమావేశం లో మంత్రి వాకిటి శ్రీహరి, నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు రాజేంద్ర ప్రసాద్ లు బి ఎల్ ఏ లకు ఓటరు సవరణ ప్రక్రియపై దిశా నిర్దేశం చేశా రు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూజూన్ 25 నుంచి జూలై 24 వరకు నిర్వహించనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించా రు. బూత్ లెవల్ ఆఫీసర్లు అందించే ఓటరు ఎన్యూమ రేషన్ ఫారాలను అర్హులైన ప్రతి ఓటరుకు చేరేలా బూత్ లెవల్ ఏజెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ సవరణ ప్రక్రియలో నియోజ కవర్గంలో అర్హులైన ప్రతీ వ్యక్తి ఓటు హక్కును కాపాడే దుకు మనమందరం అప్ర మత్తంగా ఉండాల్సిన అవ సరం ఉందన్నారు. మక్తల్ లో 80 వేల ఓట్లను చో?రీ చేయ డానికి ప్రయత్నాలు జరుగు తున్నాయన్నారు. పశ్చిమ బెంగాల్ లో సర్ పేరుతో లక్షలాది ఓట్లను తొలగించి టీఎంసీ ని అధికారంలోకి రానీయకుండా బిజెపి అడ్డు కున్నదని మంత్రి విమర్శిం చారు. మన రాష్ట్రంలో కూడా లక్షలాది ఓట్లను తొల గించడానికి బిజెపి కుట్రలు చేస్తోందని మంత్రి దుయ్యబ ట్టారు. తెలంగాణ లో అలా జరగకుండా ఉండాలంటే మనందరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నియోజకవర్గం లోని 7 మండలాల్లో ప్రతి బూత్ స్థాయిలో ప్రత్యేక బృందా లను ఏర్పాటు చేసి ఓటరు ఎన్యూమరేషన్ ఫారాలు అందని వారికి అవి చేరాలని స్పష్టం చేశారు . ఓటరు ఎన్యూమరేషన్ ఫారం సమర్పించకపోతే జూలై 30న విడుదలయ్యే ముసా యిదా ఓటరు జాబితాలో పేరు తొలగిపోయే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. తమ తమ గ్రామాల్లో ఓటరు జాబితాలో పేర్లు లేని వారిని గుర్తించి నమోదు చేయించా లని బూత్ లెవల్ ఏజెంట్ల కు పిలుపునిచ్చారు. ఓటరు సవరణ ప్రక్రియ ఈనెల 25న ప్రారంభమై వచ్చేనెల 24 వరకు జరుగు తుందని తెలిపారు. తర్వాత వచ్చే నెల 31న ముసాయి దా ప్రచురణ జరుగుతుంద న్నారు. ఓటరు సవరణ ప్రక్రియలో అభ్యంతరాలు ఏమైనా ఉంటే జులై 31 నుండి ఆగస్టు 30 వరకు స్వీకరిస్తారని అంతలోపే మన ఓటు హక్కును కాపా డుకోవడానికి వీలవుతుందని మంత్రి సూచించారు. ఓటరు జాబితాలోని తప్పులను గుర్తించి సకాలంలో ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకె ళ్లాలని సూచించారు. ఒకవేళ ఊరు విడిచి వేరే ప్రాంతానికి వెళ్లినా ఓటరు జాబితా నుంచి తొలగి పోకుండా చర్యలు తీసు కోవాలని బి ఎల్ ఏ లకు సూచించారు. ఈ సందర్భంగా సమావేశానికి వచ్చిన వారి తో ఓటు హక్కు పై మంత్రి వాకిటి శ్రీహరి గారు ప్రతిజ్ఞ చేయించారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



తిరుమల పాలెం ':వైద్యులు, సిబ్బంది సమయపాలనతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలినూతన ఆసుపత్రి అందుబాటుతో గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుతాయితిరుమలాయపాలెం 100 పడకల ఏరియా హాస్పిటల్ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలితిరుమలాయపాలెం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం తనిఖీ చేసి, నూతనంగా నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ పనుల పురోగతిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ఖమ్మం'తిరుమలాయపాలెం, ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రతి రోగికి సత్వర మెరుగైన సేవలు అందేలా వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. పాలేరు నియోజకవర్గంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, లేబర్ రూమ్, ఎమర్జెన్సీ వార్డ్, ఓపి రూమ్, ల్యాబ్, కాన్పుల అపరేషన్ థియేటర్, ప్రసుతి వార్డు, అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, రోగులకు అందుతున్న సేవలు, మందుల నిల్వలు, సిబ్బంది హాజరు తదితర అంశాలను పరిశీలిస్తూ రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవల వివరాలను ఆరా తీశారు. ఔషధ నిల్వల గదిని పరిశీలించి అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోగులకు అత్యవసర మందుల నిల్వలు, చికిత్స విధానంలో ఏలాంటి ఆలస్యం లేకుండా వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి వైద్యులు, సిబ్బంది సకాలంలో అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచి, రోగులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని అన్నారు. తిరుమలాయపాలెం ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు పెంచడానికి చర్యలు తీసుకోవాలని, ఆశా కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ గర్భిణీ మహిళలను ఎప్పటికప్పుడు ఫాలోఅప్ చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో ఉన్న వసతులను వినియోగించుకుంటూ ప్రసవాల సంఖ్య పెంచాలని ఆ దిశగా వైద్య అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం తిరుమలాయపాలెం మండలం కేంద్రంలో నూతనంగా 26 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న 100 పడకల ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణాలకు ఉపయోగించే కాంక్రీట్, సిమెంట్, ఐరన్ ల నాణ్యత ను పర్యవేక్షించారు. హాస్పిటల్ లో గుర్తించిన ప్రాధాన్యత పనులు త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలని, జిల్లా యంత్రాంగం పనుల పూర్తిలో సహకారం అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం వైద్య రంగ అభివృద్ధిని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని ముందుకు సాగుతున్నదని తెలిపారు. మండల, గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని అన్నారు. పనుల నాణ్యతపై ఎటువంటి రాజీ ఉండకూడదని, ప్రతి దశలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో ఆలస్యం లేకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన వనరులు సమకూర్చుకుని, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్ ఉన్న ఆస్పత్రి భవన నిర్మాణ పనులు, పూర్తి చేసి, కావలసిన వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలు ఏర్పంచుకొని ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్, మెడికల్ సూపరింటెండెంట్ డా. కృప ఉషశ్రీ, వైద్య శాఖ ఇఇ ఉమామహేశ్వరరావు, తిరుమలాయపాలెం మండల ఎంపిడివో సిలార్ సాహెబ్, తహసీల్దార్ విల్సన్, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

### తహశీల్దార్ ద్వారా ప్రభుత్వానికి వినతి పత్రం



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూన్ 19 ()తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం పిలుపుమేరకు స్వర్ణకారుల సమస్యల పరిష్కారం కొరుతూ సుల్తానాబాద్ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కు వినతి పత్రం అందించడం జరిగింది. స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, జి.వో.272 సవరణ చేసి దొంగ బంగారం రికవరి కేసుల నుండి కాపాడలని, 50 సంవత్సరాలు దాటిన స్వర్ణకారులకు రూపాయలు 5వేలు పెన్షన్ ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ స్వర్ణకార సంఘ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పోలాస సత్యనారాయణ కందుకూరి ప్రకాశ్ రావు(పెద్దన్న)లతో పాటు కోశాధికారి కనపర్తి భాస్కర చారి వర్కింగ్ ప్రెసిడెంట్ కాసర్ల రాజమౌళి , కందుకూరిఈశ్వర చారి, చిలుముల వెంకటస్వామి, పొలాస ప్రదీప్ కుమార్, తిప్పర్తి తిరుపతి, మియాపురం సదానందం, ఎర్రోజు వేణు రావుల రాజు, పెందోటపృద్వీ, కట్ట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఖమ్మం...




‘ ఖమ్మం:శబ్ద కాలుష్యం సృష్టించే బుల్లెట్ సైలెన్సర్లను రోడ్డు రోలర్ కింద వేసి ధ్వంసం: ట్రాఫిక్ ఇన్స్పెక్టర్నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేసి విపరీతమైన శబ్ద కాలుష్యం సృష్టించే బుల్లెట్ సైలెన్సర్లను పోలీస్ హెడ్ క్వాటర్స్ లో రోడ్డుపై పరిచి రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేయడం జరిగిందని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. బైక్‌ల విషయంలో స్టైల్ కోసం కొంత మంది యువకులు,ఆకతాయిలు తమ బైకులకు శబ్దం ఎక్కువగా వచ్చే సైలెన్సర్లను అమర్చుకుంటూ... ఆ సైలెన్సర్ల అర్థాన్నే మార్చేస్తున్నారని అన్నారు. ఇంకొంత మందైతే.. ఆ సైటెన్సర్లకు రంధ్రాలు చేసి మరీ సౌండ్ వచ్చేలా చేస్తున్నారని, అది ధాం.. ధాం.. అంటూ పెద్దగా సౌండ్ చేసుకుంటూ పోతే వారికి అదో రకమైన పైశాచిక ఆనందం మన్నారు. సైలెంట్‌గా పోయేవాళ్లు.. ఆ సైలెన్సర్ల నుంచి వచ్చే శబ్దాలు విని భయపడుతున్నారని అన్నారు. వయసు పైబడిన వారు, గుండె జబ్బులు ఉన్నవారికైతే గుండె ఆగినంత పనౌతుందని అనేక ఫిర్యాదు వచ్చాయని, ఈ నేపథ్యంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు పర్యవేక్షణలో నగరంలో సైలెన్సర్లపై కొరడా ఝుళిపించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా బైక్‌లకు పెద్దగా శబ్దం వచ్చేలా అమర్చిన సైలెన్సర్లను గుర్తించామన్నారు. అధికంగా శబ్దం చేస్తున్న 1650 బైకులను గుర్తించి వాటి సైలెన్సర్లను తీయించి, రోడ్డుపై ఇలా పేర్పించి.. రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేయించామన్నారు. యువత ఎక్కువగా తమ బుల్లెట్ వాహనాలకు అధిక మోతాదులో శబ్దం వచ్చే సైలెన్సర్లను వాడుతున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలకు కౌన్సెలింగ్ ఇవ్వాలని తల్లిదండ్రులకు సూచించారు. ఇకపై వాహనాలకు అధిక శబ్దం చేసే హారన్లపైనా దృష్టి సారిస్తామని ఆయన చెప్పరు.

## సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఖమ్మం...

‘ ఖమ్మం:సైబర్ నేరస్తుడిని అరెస్టు చేసిన ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులుఆన్లైన్ లో నకిలీ పత్రాలు



మరియు నకిలీ పేరుతో విద్యార్థులకు ట్రైనింగ్స్ ఇస్తామని నమ్మించి, 10 లక్షల రూపాయలు మోసం చేసిన కేసులో ఒకరిని ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు హైదరాబాద్ లో అరెస్టు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునిల్ దత్ తెలిపారు. కేసు వివరాలలోకి వెళితే... ఖమ్మం జిల్లాకు చెందిన ప్రముఖ విధ్య సంస్థ కి వాట్సాప్ లో హైదరాబాద్ ప్రొఫెసర్ అని పరిచయం చేసుకొని,మీ కళాశాల విద్యార్థులకు ట్రైనింగ్స్ నిర్వహిస్తామని చెప్పి , నకిలీ డాక్యుమెంట్స్, నకిలీ వీ.ా.ఖ ల ను ఆన్లైన్ లో పంపించి , 10 లక్షలు రూపాయలు మోసశీ చేసిన కేసులో నిందితుడు అక్కౌంట్ హోల్డర్ అయిన ఙ.రవి కిరణ్ , వయస్సు 26సం: లు ను హైదరాబాద్ లో అరెస్టు చేసి ఖమ్మం సైబర్ క్రైం కోర్టులో హాజరు పరిచి, రిమాండ్ కి తరలించినట్లు తెలిపారు.ఇంకా కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ కేసు విచారణలో ముఖ్య పాత్ర వహించిన సైబర్ క్రైమ్ డిఎస్పీ ఫణిందర్, సిఐ భూక్యా రవి కుమార్, ఎస్సై లు రశీజిత్ కుమార్ , విజయకుమార్, కానిస్టేబుల్ కృష్ణ రావు ,నాగేశ్వరావు, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

## గుండ్రాత్‌పల్లిలో ఘనంగా ‘అంగన్‌వాడి బడి బాట’ కార్యక్రమం

కాటారం, కాటారం మండల పరిధిలోని గుండ్రాత్‌పల్లి గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం మహిళా




అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు “అంగన్‌వాడి బడి బాట -- మన ఊరు, మన అంగన్‌వాడి” అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందిస్తున్న పూర్వ ప్రాథమిక విద్య, పోషకాహారం, ఆరోగ్య సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గుండ్రాత్‌పల్లి సర్పంచ్ తోటపల్లి సావిత్రి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రాలు నేడు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఆటపాటలతో కూడిన వినూత్న పద్ధతుల్లో విద్యాబోధన అందిస్తున్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు.అంగన్‌వాడీ టీచర్లు వేమునూరి వెంకటాలక్ష్మి, రాజాలక్ష్మి మాట్లాడుతూ, ఎల్‌కేజీ, యూకేజీ వయస్సు పిల్లలకు తెలుగు, ఇంగ్లీష్ భాషా పరిచయాలు, రైమ్స్, కథలు, ఆటల ద్వారా బోధన అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ఉచిత పౌష్టికాహారం, వ్యాధి నిరోధక టీకాలు, నెలకు ఒకసారి బరువు, ఎత్తు పరీక్షలు వంటి ఆరోగ్య సేవలు కూడా అందిస్తున్నట్లు వివరించారు.స్థానిక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రవీందర్ మాట్లాడుతూ, అంగన్‌వాడీ దశలోనే పిల్లలకు బలమైన పునాది ఏర్పడితే ప్రాథమిక విద్యను మరింత సులభంగా అర్థం చేసుకోగలరని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన చిన్నారులు, వారి తల్లిదండ్రులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిని ఓర్వలేకే పుట్ట మధు విమర్శలు..

### మాట్లాడే అర్హత పుట్ట మధుకు లేదు

### టెండర్లు వేయకముందే అవినీతి ఆరోపణలా?

### మెడిగడ్డ ద్వారా ఎన్ని కోట్లు వెనుకేశారు?



భూపాలపలిదక్షిణ కాశీగా పేరుగాంచిన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధిని ఓర్వలేకే బిఆర్ఎస్ నాయకుడు పుట్ట మధు తప్పుడు విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో కాళేశ్వరం ఆలయం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని, ఇప్పుడు జరుగుతున్న ప్రగతిని చూసి తట్టుకోలేకనే కుట్రపూరిత ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.శు క్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐతే ప్రకాష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు అక్బర్ ఖాన్ తదితరులు మాట్లాడారు.మాట్లాడే అర్హత పుట్ట మధుకు లేదుహత్యలు, కుట్రలు, రౌడీయిజం, భూ దందాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన పుట్ట మధుకు కాళేశ్వరం గురించి మాట్లాడే అర్హత లేదని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడకుండా, కేవలం పదవుల కోసం కొట్లాడే నలుగురు నాయకులను వెంటబెట్టుకుని, పవిత్రమైన ఆలయంలో నిలబడి మూర్ఖపు మాటలు మాట్లాడటం సరికాదన్నారు. ఇలాంటి వ్యక్తికి మహాదేవపూర్ మండలంలో అడుగుపెట్టే అర్హతే లేదని వారు స్పష్టం చేశారు.

**టెండర్లు**

**వేయకముందే 100 కోట్ల అవినీతి ఆరోపణలా?**

దేవస్థానానికి సంబంధించిన టెండర్లు ఇంకా చేపట్టకముందే 100 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపణలు చేయడం పుట్ట మధు అజ్ఞానానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. భక్తుల ఆదరణ, సహకారంతోనే ఆలయ పునర్నిర్మాణం చేపడుతుంటే, కనీస ఆలోచన లేకుండా రాజకీయాల కోసం ఆలయ ప్రతిష్టను బలిపట్టాలని చూడటం దుర్మార్గమన్నారు.

**మెడిగడ్డ ద్వారా**

**ఎన్ని కోట్లు వెనకేశారు?**

లక్ష కోట్ల కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఎమ్మెల్యేగా ఉన్న పుట్ట మధు.. గోదావరి సాక్షిగా మెడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిన ఉదంతంలో తమకు ఎన్ని కోట్లు వచ్చాయో, ఎంత అవినీతికి పాల్పడ్డారో ప్రజలకు సమాధానం చెప్పాలని నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హసీనాబాను , ఎక్స్ పిఎసిఎస్ చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి, ఎక్స్ ఎంపిటిసి సుధాకర్, సీనియర్ నాయకుడు రామారావు, కాంగ్రెస్ నాయకులడు కటకం అశోక్, రామన్ రావు పాల్గొన్నారు. అలాగే మండల ప్రధాన కార్యదర్శులు తిరుపతిరెడ్డి, శంకరయ్య, శివరాజు, సంతోష్, మోత సాంబయ్య, డిసిసి ప్రధాన కార్యదర్శి కోట సమ్మయ్య, వార్డు సభ్యులు గడ్డం స్వామి, నయుముద్దీన్, మొహమ్మద్ తదితరులు పాల్గొని పుట్ట మధు వైఖరిని తీవ్రంగా ఖండించారు.

## వైద్య ప్రవేశ అర్హత పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమలు

### 500 మీటర్ల పరిధిలో గుమికూడరాదని పోలీస్ కమిషనర్ ఆదేశాలు



సిద్దిపేట, జూన్ 19:సిద్దిపేట జిల్లాలో ఈ నెల 21న నిర్వహించనున్న వైద్య ప్రవేశ అర్హత పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాల పరిసరాల్లో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత-2023లోని సెక్షన్ 163ను అమలు చేస్తున్నట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ తెలిపారు.సిద్దిపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, మెదక్ రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాల చుట్టూ 500 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమికూడడాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆంక్షలు జూన్ 21 ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు అమల్లో ఉంటాయి.పరీక్ష కేంద్రాల సమీపంలో కర్రలు, రాళ్లు, ఆయుధాలు లేదా ఇతర ప్రమాదకర వస్తువులు తీసుకురావడం నిషేధమని, పరీక్షలకు సంబంధించిన నిషేధిత పత్రాలు కలిగి ఉండరాదని హెచ్చరించారు. అలాగే పరీక్షల సమయంలో కేంద్రాల సమీపంలోని నకలు ప్రతుల కేంద్రాలను తప్పనిసరిగా మూసివేయాలని ఆదేశించారు.విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సైనిక సిబ్బంది, విద్యాశాఖ ప్రత్యేక తనిఖీ బృందాలు, అంత్యక్రియల ఊరేగింపులకు ఈ ఆంక్షల నుంచి మినహాయింపు ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు రాసేలా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## విద్యార్థుల భద్రతే లక్ష్యం- పాఠశాల బస్సులపై ప్రత్యేక తనిఖీలు



సిద్దిపేట, జూన్ 19: పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు సిద్దిపేట పట్టణంలోని మెరీడియన్ పాఠశాల బస్సులను ట్రాఫిక్ ఏసీపీ ఎం. సుమన్ కుమార్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ సీఐ సీహెచ్. ముత్యం రాజు తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల బస్సుల భద్రతా ప్రమాణాలు, సంబంధిత పత్రాలు మరియు విద్యార్థుల రవాణా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాల యాజమాన్యం, డ్రైవర్లు, సహాయక సిబ్బందికి విద్యార్థుల భద్రతకు సంబంధించిన పలు సూచనలు చేశారు.తనిఖీల్లో భాగంగా బస్సు డ్రైవర్లు పరిశుభ్రమైన యూనిఫాం ధరించి, పేరు పలకతో విధులు నిర్వహిస్తున్నారా లేదా పరిశీలించారు. అలాగే వాహనాలకు చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రం, అనుమతి పత్రం, బీమా, కాలుష్య నియంత్రణ ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయా లేదా తనిఖీ చేశారు.ప్రతి బస్సులో ప్రథమ చికిత్స పెట్టె, జీపీఎస్ పరికరం, సహాయక సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. సీటింగ్ సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించరాదని, అత్యవసర నిష్క్రమణ ద్వారం సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలని ఆదేశించారు.విద్యార్థుల సురక్షిత ప్రయాణం కోసం అన్ని భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పాఠశాల యాజమాన్యాలకు సూచించినట్లు ట్రాఫిక్ ఏసీపీ ఎం. సుమన్ కుమార్ తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం - చెరుకు శ్రీనివాస్ రెడ్డి



మిరుదొడ్డి, జూన్ 19: పేదలకు సొంతింటి కలను సాకారం చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మిరుదొడ్డి మండలం మల్లుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఐదు ఇందిరమ్మ గృహాలను ఆయన ప్రారంభించి గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.లబ్ధిదారులు కుర్ర ఎల్లయ్య, కర్రె సుజాత--నాగరాజు, ఆఫ్రిన్ బేగం--నవాజుద్దీన్, తిప్పరబోయిన మమత--సాయికుమార్, సిద్ధి రంగీల--నరేష్ కుటుంబాలు నిర్మించుకున్న నూతన గృహాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా వేలాది కుటుంబాల సొంతింటి కల నెరవేరుతోందన్నారు.అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని, దుబ్బాక నియోజకవర్గంలో రెండో విడతలో మరిన్ని ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్ధిని భూపతి గౌడ్, మాజీ సర్పంచ్ ఎనగంటి కిష్టయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చెన్నై భూపాల్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహమ్మద్ జహంగీర్, ఆత్మ కమిటీ డైరెక్టర్ పూదూరి మహేష్, గ్రామ నాయకులు రత్నారెడ్డి, కనకయ్య, యాదగిరి, నాగరాజు, నవాజుద్దీన్, బాలు, బాలరాజు, రాములు, సోలిపేట ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యాన్ని మించి 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

### రైతుల ఖాతాల్లో రూ.1,036 కోట్లు జమ:కలెక్టర్ కే. హైమావతి



‘ సిద్దిపేట, జూన్ 19: యాసంగి 2025-26 సీజన్‌కు సంబంధించి సిద్దిపేట జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా పూర్తైందని జిల్లా కలెక్టర్ కే. హైమావతి తెలిపారు. జిల్లాకు ప్రభుత్వం నిర్దేశించిన 4.50 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని అధిగమించి 5,04,161 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం విశేషమన్నారు.జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 427 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 97,807 మంది రైతుల నుంచి రూ.1,204 కోట్ల విలువైన వరిధాన్యాన్ని సేకరించినట్లు తెలిపారు. ఇందులో ఇప్పటికే రూ.1,036 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. మిగిలిన చెల్లింపులు కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని పేర్కొన్నారు.జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ ఆధ్వర్యంలో అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టడంతో కొనుగోళ్లు ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగాయని తెలిపారు. అదనపు హమాలీలు, రవాణా వాహనాలు ఏర్పాటు చేయడం, మిల్లర్లతో సమన్వయం పెంచడం ద్వారా ధాన్యం తరలింపును వేగవంతం చేసినట్లు చెప్పారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ, టార్పాలిన్లు, హమాలీలు, రవాణా సదుపాయాలు కల్పించడంతో పాటు అకాల వర్షాల సమయంలో ధాన్యం తడవకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అధికారుల నిరంతర పర్యవేక్షణతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదన్నారు.కొనుగోలు చేసిన 5,04,161 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటికే రైస్ మిల్లులు, గోదాములకు దాదాపు పూర్తిగా తరలించినట్లు కలెక్టర్ వెల్లడించారు. అదనపు గోదాములు ఏర్పాటు చేయడం వల్ల ఎక్కడా ధాన్యం నిల్వ సమస్యలు తలెత్తలేదని తెలిపారు.జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు విజయవంతంగా పూర్తికావడంలో ప్రజాప్రతినిధులు, రైతులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్ మిల్లర్లు, రవాణా కాంట్రాక్టర్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది అందించిన సహకారాన్ని కలెక్టర్ అభినందించారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో ఎం.ఆర్.ఐ యంత్రం ప్రారంభానికి సిద్ధం: జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

### పనులను పరిశీలించిన కలెక్టర్

### ఇకపై జిల్లాలోనే అధునాతన వైద్య సేవలు

### పేర్ల నమోదుకు ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలి అధికారులకు ఆదేశం



భూపాలపల్లి: జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఎం.ఆర్.ఐ యంత్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శుక్రవారం నిశితంగా పరిశీలించారు. యంత్రం ఏర్పాటు పనులు ప్రస్తుతం తుదిదశకు చేరుకున్నాయని, ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లను సత్వరమే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రిలో ఎం.ఆర్.ఐ యంత్రం అందుబాటులోకి రావడం వల్ల జిల్లా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, స్థానికంగానే అధునాతన వైద్య సేవలు లభిస్తాయని తెలిపారు. ఎం.ఆర్.ఐ పరీక్షలు చేయించుకునే రోగుల వివరాలను పక్కాగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.గతంలో ఎం.ఆర్.ఐ వైద్య సేవల కోసం పేద ప్రజలు ఇతర సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇకపై ఆ అవసరం లేకుండా సమయానుకూలంగా, తక్కువ ఖర్చుతోనే మెరుగైన వైద్య పరీక్షలు ఇక్కడే చేయించుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు అవసరమైన సిబ్బందిని, సాంకేతిక సదుపాయాలను సమృద్ధిగా అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ పరిశీలన కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, పలువురు ప్రభుత్వ వైద్యులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యప్రాచ్య శాంతి కోసం కలిసి పనిచేద్దాం

- చైనా- రష్యాలు ప్రతిన



బీజింగ్ : మధ్యప్రాచ్య శాంతి కోసం రష్యా - చైనాలు ప్రతినబూనాయి. హార్మూజ్ జలసంధి మూసివేత అనంతం ప్రాంతీయ స్థిరత్వానికి, ఇంధన సరఫరా గొలుసుకు ప్రమాదం కలిగించే పరిస్థితిని ఖండించడానికి, ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఒత్తిడి తేవడానికి ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తమ పదవులను ఉపయోగించుకోవాలని రష్యా- చైనాలకు చెందిన ఇద్దరు దౌత్యవేత్తలు అంగీకరించారు. వ్యూహాత్మక అంశాలపై రష్యాతో నిరంతర సంప్రదింపులు కొనసాగించడానికి తమ దేశం సిద్ధంగా ఉందని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి తెలిపారు. రష్యా- చైనాలు చేసే ఉమ్మడి ప్రయత్నాల ద్వారా ప్రాంతీయ శాంతిని నెలకొల్పడం, స్థిరత్వాన్ని పరిరక్షించడమే తమ ప్రధాన లక్ష్యాలని వాంగ్‌యి అన్నారు. మధ్యప్రాచ్యంలో నెలకొన్న సంఘర్షణ విస్తరణను నివారించడానికి, ఈ ప్రాంతంలోని దేశాల సమగ్రతను కాపాడటానికి రెండు ప్రధాన శక్తులు కలిసి రావడం.. వాటి ప్రభావం చాలా కీలకం. ఈ నేపథ్యంలో రష్యా- చైనాలు ప్రాంతీయ శాంతికి, ఉద్రిక్తతలు తగ్గించడానికి ప్రయత్నిస్తున్నాయి.

## ఈస్టర్ నాడు నైజీరియాలోని రెండు చర్చిలపై దాడులు



అబుజా : ఈస్టర్ నాడు నైజీరియాలోని రెండు చర్చిలపై దుండగులు దాడులు జరపగా ఏడుగురు మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించి అవోన్ జిల్లా కౌన్సిలర్ మార్క్ బావా తెలిపిన వివరాల ప్రకారం.. మొదట నైజీరియాలో ప్రసిద్ధి చెందిన ఎసిడబ్ల్యు చర్చి, సెయింట్ అగస్టిన్స్ కాథలిక్ చర్చిలను గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి చుట్టుముట్టారు. చర్చికి వచ్చిన వారిపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల వల్ల ఏడుగురు మృతి చెందారు. గ్రామీణ ప్రాంతాల్లో టెలికమ్యూనికేషన్ల మౌలిక సదుపాయాలు సరిగ్గా లేకపోవడం వల్ల భద్రతా దళాలకు త్వరగా ఈ ఘటనకు సంబంధించిన సమాచారం అందలేదు. దీంతో దుండగులు రెచ్చిపోయారు. ఈ ఘటనపై నైజీరియా కాథలిక్ బిషప్స్ కాన్ఫరెన్స్ (సిబిసిఎన్) విచారం వ్యక్తం చేసింది. కాగా, ఈ ఘటనపై సిబిసిఎన్ అధ్యక్షుడు మాథ్యూ మ్యాన్-ఓసోన్డాగోసో విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన జరగడానికి పేలవమైన పాలన కారణమని ఆయన తీవ్రంగా ఆరోపించారు. స్వార్థం, బంధుప్రీతి, మతతత్వం, దేశ ఉమ్మడి శ్రేయస్సుపట్ల నిజమైన నిబద్ధత లేకపోడమే ఈ పరిస్థితి కారణమని ఆయన విమర్శించారు. నైజీరియాలోని మధ్య, వాయువ్య ప్రాంతాలలో నిరంతరం మతపరమైన దాడులు జరుగుతూనే ఉంటాయి. సాహెల్ ప్రావిన్స్‌లోని ఇస్లామిక్ స్టేట్‌తో సంబంధం ఉన్న గ్రూపుల చర్యల వల్ల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు.

## కార్పొరేట్ చట్టాల (సవరణ) బిల్లును ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ : లోక్‌సభలో కార్పొరేట్ చట్టాల (సవరణ) 2026 బిల్లును కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. సమగ్ర పరిశీలన కోసం ఈ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)కి పంపాలన్న తీర్మానాన్ని లోక్‌సభ ఆమోదించింది. ఈ బిల్లు పరిమిత బాధ్యత భాగస్వామ్య చట్టం 2008, కంపెనీల చట్టం 2013లకు మరిన్ని సవరణలను కోరుతోంది. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వ ఆర్థిక ప్రతిపాదనలను వివరించే ఫైనాన్స్ బిల్లు 2026ను కూడా పరిశీలన కోసం ఆర్థికమంత్రి ప్రవేశపెట్టనున్నారు. కాగా, నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కార్పొరేట్ చట్టాల (సవరణ) బిల్లును ప్రవేశపెట్టడానిన కాంగ్రెస్ ఎంపి మనీష్ తివారీ వ్యతిరేకించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 245-246ను ఉల్లంచి ఈ బిల్లులో ముఖ్యమైన శాసన విధులను మితిమీరి అప్పగించారు. కంపెనీల వర్గీకరణ, మినహాయింపులు, పాటించాల్సిన నిబంధనల నిర్ధారణ, కార్పొరేట్ సామాజిక బాధ్యతకు సంబంధించిన పరిమితి, ఆడిట్ బాధ్యతలు, జరిమానాల చట్రాలు వంటి కీలక విధానపరమైన అంశాలను తగిన శాసన మార్గదర్శకత్వం లేకుండా అనుబంధ శాసనలకు వదిలివేశారని మనీష్ తివారీ విమర్శించారు.

## ప్రపంచంలో 1970ల నాటికన్నా తీవ్రమైన చమురు సంక్షోభం



సిడ్నీ : 1970ల నాటి రెండు సంక్షోభాల కన్నా తీవ్రమైన చమురు సంక్షోభాన్ని ప్రపంచం ఎదుర్కొంటోందని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఇఎ) చీఫ్ ఫతిహ్ బిరోల్ హెచ్చరించారు. కాన్‌బెర్రాలోని నేషనల్ ప్రెస్ క్లబ్ ఆఫ్ ఆస్ట్రేలియాలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ యుద్ధం కారణంగా తలెత్తిన సంక్షోభం, 1973, 1979 నాటి చమురు సంక్షోభాలు మరియు 2022లో ఉక్రెయిన్‌పై రష్యా దాడి ఫలితంగా తలెత్తిన గ్యాస్ కొరతను కూడా మించిపోయిందని అన్నారు. వాస్తవ పరిస్థితుల ప్రకారం.. ఈ సంక్షోభం ప్రస్తుతం రెండు చమురు సంక్షోభాలు మరియు గ్యాస్ పతనం కలిసినట్లుగా ఉందని అన్నారు. హార్ముజ్ జలసంధిని మూసివేయడం మరియు ఇంధన సౌకర్యాలపై జరిగిన దాడుల కారణంగా ప్రపంచ చమురు సరఫరా రోజుకి సుమారు 11 మిలియన్ బ్యారెళ్ల (బిపిడి) మేర తగ్గిందని, ఇది 1970ల నాటి రెండు సంక్షోభాల కొరత కంటే రెట్టింపును దాటిందని బిరోల్ పేర్కొన్నారు. రష్యా ఉక్రెయిన్‌పై దాడి చేసిన అనంతరం ఏర్పడిన 75 బిలియన్ క్యూబిక్ మీటర్ల కొరతతో పోలిస్తే, లిక్విడ్ సహజవాయువు (ఎల్ఎన్‌జి) సరఫరా సుమారు 140 బిలియన్ క్యూబిక్ మీటర్ల మేర తగ్గిందని అన్నారు. తొమ్మిది దేశాల్లోని సుమారు 40 చమురు సౌకర్యాలు దెబ్బతిన్నాయని చెప్పారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అతిపెద్ద ముప్పును ఎదుర్కొంటుందని, వీలైనంత త్వరగా ఈసమస్య పరిష్కారమౌతుందని తాను ఆశిస్తున్నానని అన్నారు. అవసరమైతే వ్యూహాత్మక చమురు నిల్వలను విడుదల చేయాల్సిందిగా పలు దేశాలతో తాను చర్చిస్తున్నానని అన్నారు. అయితే ఈ సంక్షోభానికి ఏకైక అత్యంత ప్రధానమైన పరిష్కారం హార్ముజ్ జలసంధిని తెవరడమేనని స్పష్టం చేశారు.

# రీల్ కూడా వార్తే..

## ప్రభుత్వ నియంత్రణ పరిధిలోకి ఇన్ఫ్లుయెన్సర్లు

## ఐటీ నిబంధనలకు సవరణలు ప్రతిపాదించిన కేంద్రం

## అమలైతే పోస్ట్ చేసే ప్రతి విషయంపై పెరగనున్న నిఘా

వార్తలు, రాజకీయ సంబంధ అభిప్రాయాలను సోషల్ మీడియా వేదికగా పంచుకుంటున్నారా? రానున్న రోజుల్లో కాస్త జాగ్రత్తగా వ్యవహరించాల్సిందే. ఐటీ నిబంధనలు--2021కి కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ కొన్ని సవరణలను ప్రతిపాదించింది. ఇవి కార్యరూపంలోకి వస్తే యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను కూడా ప్రచురణకర్తలుగా పరిగణిస్తారు. అంటే వారు పోస్ట్ చేసే ప్రతి విషయంపై ప్రభుత్వ నిఘా, బాధ్యత పెరుగుతుంది.

క్రియేటర్లూ జాగ్రత్త..

వార్తలు, రాజకీయ సంబంధ పోస్టులను పంచుకునే యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లను ఇప్పటివరకు ప్రభుత్వం వార్తా సంస్థలుగా గుర్తించలేదు. దీనివల్ల టీవీ చానెళ్లకు ఉండే కఠిన నిబంధనలు వీరికి ఉండేవి కావు. ప్రతిపాదిత కొత్త సవరణల ప్రకారం ఏదైనా కంటెంట్‌ను 'తప్పు'అని ప్రభుత్వం భావిస్తే.. దాన్ని వెంటనే తొలగించే అధికారం ప్రభుత్వానికి పెరుగుతుంది. అంటే సోషల్ మీడియాలో పోస్ట్ చేసేటప్పుడు క్రియేటర్లు మరింత జాగ్రత్తగా ఉండాలి. లేదంటే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

### ఏమిటీ కొత్త ప్రతిపాదన?

సమాచార సాంకేతికత (మధ్యవర్తిత్వ మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా నైతిక నియమావళి) రెండో సవరణ నిబంధనలు--2026 కోసం కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ ఒక ముసాయిదాను విడుదల చేసింది. దీనిపై ఏప్రిల్ 14 వరకు ప్రజల అభిప్రాయాలను కోరింది. సురక్షితమైన ఇంటర్నెట్‌ను నిర్మించడమే దీని లక్ష్యమని ప్రభుత్వం చెబుతుండగా.. విమర్శకులు మాత్రం ఇది సామాన్యుల డిజిటల్ వాక్ స్వాతంత్ర్యంపై ప్రభుత్వానికి అపరిమితమైన కొత్త అధికారాలను కట్టబెడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్ ఈ ముసాయిదా నిబంధనలను డిజిటల్ నియంతృత్వంగా అభివర్ణించింది.




### పరిధిలోకి ఎవరు వస్తారు?

ఈ సవరణలు యూట్యూబర్లు, ఇన్‌స్టాగామ్ రీల్స్ క్రియేటర్లు, 'ఎక్స్'యూజర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లతో సహా ప్రైవేట్ వ్యక్తులు పోస్ట్ చేసే వార్తలు, రాజకీయ అభిప్రాయాలతో కూడిన కంటెంట్ ఐటీ నిబంధనలలోని 'పార్ట్--3'పరిధిలోకి వస్తాయి. గతంలో వృత్తిపరమైన మీడియా సంస్థలకు మాత్రమే పరిమితమైన మూడంచెల పర్యవేక్షణ విధానం ఇకపై వీరికి కూడా వర్తిస్తుంది.

### కొత్త నిబంధన ఏమిటి?

ప్రభుత్వం జారీ చేసే లిఖితపూర్వక వివరణలు, సలహాలు, ఉత్తర్వులు, మార్గదర్శకాలను సోషల్ మీడియా సంస్థలు కచ్చితంగా పాటించాలి. ఏదైనా ప్లాట్‌ఫాం నిరాకరిస్తే వాటికి ఉన్న 'సేఫ్ హార్బర్'రక్షణను ప్రభుత్వం రద్దు చేస్తుంది. సాధారణంగా సోషల్ మీడియాలో ఎవరో ఒకరు తప్పుడు పోస్ట్ పెడితే దానికి ఆ సంస్థను బాధ్యులను చేయకూడదనేది సేఫ్ హార్బర్ నిబంధన ఉద్దేశం. ఈ రక్షణ పోతే యూజర్లు చేసే ప్రతి తప్పుకు లేదా పెట్టే ప్రతి వివాదాస్పద పోస్ట్‌కు సదరు కంపెనీయే బాధ్యత వహించాల్సి ఉంటుంది. దీనివల్ల కోర్టు కేసులు, భారీ జరిమానాలను ఎదుర్కోవాల్సి వస్తుంది.

### ఎంత సమయంలో తొలగించాలి?

నోటీసు అందిన 2--3 గంటల్లో ప్లాట్‌ఫాంలు సదరు కంటెంట్‌ను తొలగించాల్సి ఉంటుంది. 2021 నిబంధనల ప్రకారం గతంలో ఉన్న 24--36 గంటల సమయ పరిమితితో పోలిస్తే ఇది చాలా పెద్ద మార్పు.

### విస్తృత చర్యల్లో భాగమా?

ఈ ఏడాది ఫిబ్రవరిలో కేంద్రం డీప్‌ఫేక్స్, ఏఐ ద్వారా సృష్టించిన కంటెంట్‌పై కొన్ని నిబంధనలు తెచ్చింది. దీని ప్రకారం అలాంటి కంటెంట్ ఏఐతో రూపుదిద్దుకుందని లేబుల్ వేయడం, ఫిర్యాదు వచ్చిన వెంటనే త్వరగా తొలగించడం తప్పనిసరి చేశారు. ఇప్పుడు వస్తున్న కొత్త ఐటీ ప్రతిపాదన దీనికి తదుపరి దశ. ఆన్‌లైన్లో ప్రజలు మాట్లాడే లేదా పెట్టే పోస్టులపై ప్రభుత్వ పర్యవేక్షణను మరింత పటిష్టం చేయడం దీని ప్రధాన లక్ష్యం.

# నేపాల్‌లో మారిందేమిటి?!

తిరుగుబాటు గాలి ఒకచోట పుట్టి చప్పున చల్లారిపోదు. అది సమస్య ఉన్నచోటకల్లా పోయి నిప్పు రాజేస్తుంది. శ్రీలంకలో ప్రజా ఉద్యమానికి జడిసి పాలకులు పదవులూ, ప్యాలెస్‌లూ వదిలి నిష్క్రమించిన తరహాలోనే బంగ్లాదేశ్‌లో కూడా యువజనం ధాటికి 2024 ఆగస్టులో ప్రధాని షేక్ హసీనా రాజీనామా చేసి హుటాహుటీన న్యూఢిల్లీకి చేరుకుని ఆశ్రయం తీసుకోక తప్పలేదు. ఈ రెండింటినీ చూసి కావొచ్చు... నేపాల్‌లో సైతం జెన్ జీ తరం నిరుడు సెప్టెంబర్‌లో అధికార పీఠాలను కదిలించారు. అక్కడ జరిగిన ఎన్నికల్లో శ్రీలంక, బంగ్లాదేశ్‌లకు భిన్నంగా యువతరం రాజకీయాల్లోకొచ్చి విజయం సాధించారు. ప్రముఖ ర్యాపర్, కఠ్మాండు మేయర్ బాలేంద్ర షా ప్రధాని అయ్యారు. ఆయనతోపాటు అనేక కొత్త ముఖాలు పార్లమెంటులోకి అడుగుపెట్టాయి. ఆ రకంగా నేపాల్ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. కానీ మాజీ ప్రధాని, సీపీఎన్(యూఎంఎల్) అధినేత కేపీ శర్మ ఓలిని శుక్రవారం అరెస్టు చేయడాన్ని గమనిస్తే శ్రీలంక, బంగ్లాదేశ్‌ల మాదిరి కాకుండా గత పాలకుల్ని వేధించటమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు కనబడుతోంది. శ్రీలంకలో మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘేను నిరుడు అవినీతి ఆరోపణలపై అరెస్టు చేసిన సంగతి నిజమే అయినా, ఆ వెంటనే ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు. బంగ్లాదేశ్‌లో అయితే వేధింపు రాజకీయాలకు తాను వ్యతిరేకమని కొత్త ప్రధాని తారిక్ రెహ్మాన్ ప్రకటించి ఇంతవరకూ విపక్ష నేతల జోలికి పోలేదు. హసీనాను తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ ఇప్పటికీ భారత్‌ను కోరుతున్న మాట వాస్తవమే అయినా, అదే పనిగా పేచీకి దిగే ఉద్దేశం ప్రస్తుతానికైతే దానికి ఉన్నట్టు కనబడదు. నేపాల్‌లో నిరుడు సెప్టెంబర్‌లో జరిగిన నిరసనోద్యమంలో 77 మంది ప్రాణాలు బలిగొన్న భద్రతా బలగాల కాల్పులకు కారణమన్న కేసులో శర్మ ఓలిని, అప్పటి హోంమంత్రి రమేష్ లేఖక్‌లను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం జరిగిన నేపాల్ కొత్త కేబినెట్ తొలి సమావేశంలోనే ఈ నిర్ణయం తీసుకోవటం అందరినీ ఆశ్చర్యపరిచింది. ప్రత్యేక కోర్టు మాజీ న్యాయమూర్తి గౌరీ బహదూర్ కార్కీ నేతృత్వంలోని విచారణ కమిషన్ నివేదిక ఆధారంగా ఈ అరెస్టులు జరిగాయి. నిజానికి ఆ కమిషన్ ఓలి అపరాధాన్ని నిర్ధారించలేదు. కానీ కాల్పులను ఆయనగానీ, లేఖక్‌గానీ ఆపలేకపోయారని తెలిపింది. నేపాల్‌లో ఉద్యమకాలంలో జరిగిన హింస తక్కువేమీ కాదు. పార్లమెంటు ఆవరణలో, కోర్టుల్లో గుంపులు జొరబడి విధ్వంసానికి దిగాయి. 65 మంది రాజకీయ నాయకుల, పలు వ్యాపారవేత్తల ఇళ్లు, అన్ని పార్టీల కార్యాలయాలు, జైళ్లు ఉద్యమకారుల ధాటికి దెబ్బతిన్నాయి. అలాంటి సందర్భాల్లో ఏ దేశంలోనైనా భద్రతాదళాలు మౌనంగా ఉండగలవా? అయితే ప్రదర్శకులను చెదరగొట్టే ఉద్దేశంతోకాక వారి ప్రాణాలు తీయ టానికే కాల్పులు జరిపారన్న ఆరోపణలపై అన్ని కోణాల్లోనూ విచారణ జరిపి కారకుల్ని శిక్షించాల్సిందే. కానీ కక్ష తీర్చుకోవటమే ముఖ్యమన్నట్టు



ప్రవర్తిస్తున్న తీరే ఆశ్చర్యం కలిగిస్తుంది. రిపబ్లిక్ గా ఏర్పడ్డాక నేపాల్‌లో జరిగిన పరిణామాలకు అన్ని పార్టీల నేతలూ బాధ్యులే. రాచరికాన్ని ప్రజలెందుకు తరిమికొట్టారో గ్రహించక ఫిరాయింపులతో ప్రభుత్వాలను పడగొట్టడం, అవినీతికి పాల్పడటం అక్కడి నాయకులకు రివాజయింది. వీటన్నిటినీ చూసి తీవ్రంగా కలతచెందబట్టే జెన్ జీ తరం జూలు విదిల్చింది. అదొక్కటే కారణం కాదు. యువత ఉపాధి లేమితో తీవ్ర ఇబ్బందులకు లోనవుతోంది. కొలువులు దొరక్క నైరాశ్యంలో కూరుకుపోతోంది. ఇక ఆశ్రిత పక్షపాతం, అవినీతి, ఆర్థిక వ్యత్యాసాలు సరేసరి. అత్యధిక శాతం యువత పిడికెడు మెతుకుల కోసం భారత్ సహా పలు దేశాలకు వలసపోవటం, ఎంతోకొంత మిగిల్చి కుటుంబాలకు పంపటం మామూలే. అలా పంపుతున్న డబ్బే నేపాల్ జీడీపీలో అధిక శాతం ఆక్రమిస్తోందంటే ఆశ్చర్యం కలుగుతుంది. తయారీరంగ పరిశ్రమలపైనా, ఇతర ప్రాజెక్టులపైనా దృష్టి కేంద్రీకరిస్తే తమ పిల్లలు ఇక్కడే స్థిరపడటానికి అవకాశం ఉంటుందని అనేకులు ఎదురు చూస్తున్నారు. ఈ దిశగా చర్యలు తీసుకోవటానికి బదులు కక్ష రాజకీయాలతోనే పాలనకు శ్రీకారం చుట్టి తాను గత పాలకులకు భిన్నమేమీ కాదని బాలేంద్ర షా నిరూపించారు. తిరుగుబాటు స్ఫూర్తికి ఇది విఘాతం కలిగిస్తుంది.

# ది న్యూ అడిక్షన్ ఎకానమీ.. మీ మెదడుపై అదృశ్య యుద్ధం!

ప్రపంచం మొత్తం మీ అరచేతిలో ఉందని మీరు సంబరపడుతున్నారా? కానీ వాస్తవానికి ఆ అరచేతిలో ఉన్న స్మార్ట్‌ఫోనే మిమ్మల్ని బందీని చేస్తోందని మీకు తెలుసా? సిలికాన్ వ్యాలీలోని టెక్ కంపెనీలు కేవలం సాఫ్ట్‌వేర్‌ను మాత్రమే తయారుచేయడం లేదు; అవి మన ప్రమేయం లేకుండానే మనల్ని బానిసలుగా మార్చే 'డిజిటల్ డ్రగ్స్'ను డిజైన్ చేస్తున్నాయి. దీనినే నిపుణులు 'అడిక్షన్ ఎకానమీ' అని పిలుస్తున్నారు.



### మీ సమయమే వారి పెట్టుబడి!

సాధారణంగా ఏదైనా వస్తువు కొనాలంటే మనం డబ్బులు చెల్లిస్తాం. కాని ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి యాప్స్ మనకు ఉచితంగా సేవలు అందిస్తున్నాయని మనం భ్రమపడుతుంటాం. ఒక వస్తువుకు మీరు డబ్బు చెల్లించడం లేదంటే, అక్కడ మీరే ఒక వస్తువు అని అర్థం. మీ సమయం, శ్రద్ధ, వ్యక్తిగత సమాచారమే వారి పెట్టుబడి. మీరు ఫోన్ చూస్తూ గడుపుతున్న ప్రతి అదనపు నిమిషం ఈ కంపెనీల పాలిట ఒక బంగారు గుడ్డు. మీరు ఎంత ఎక్కువ సమయం స్క్రీన్‌కు అతుక్కుపోతే, ఆ కంపెనీల షేర్ల విలువ అంతగా పెరుగుతుంది. 2026 ముగిసే నాటికి సోషల్ మీడియా యాడ్ మార్కెట్ సుమారు రూ.26 లక్షల కోట్లకు చేరుకోనుందంటే, మన ఏకాగ్రతను వారు ఎంత ఖరీదైన వస్తువుగా మార్చారో అర్థం చేసుకోవచ్చు. మెటా, గూగుల్ వంటి సంస్థలు రోజుకు వేల కోట్లు సంపాదిస్తున్నాయంటే, దానికి ఇంధనం మన మెదడులోని డోపమైన్, మన చేతిలోని సమయమే!

### దిగ్భ్రాంతికర గణాంకాలు

2025--26 నివేదికల ప్రకారం ఇటీవలి గణాంకాలు చూస్తుంటే మనం ఎంతటి ప్రమాదకర స్థితిలో ఉన్నామో అర్థమవుతుంది. సగటు భారతీయుడు రోజుకు దాదాపు 6.5 గంటల సమయాన్ని ఇంటర్నెట్‌పై గడుపుతున్నాడు. ఇందులో మూడు గంటల కంటే ఎక్కువ సమయం కేవలం వినోదం, సోషల్ మీడియాకే పరిమితం. ఒకప్పుడు మనుషుల్లో పన్నెండు సెకన్లుగా ఉన్న అటెన్షన్ స్పాన్, ఇప్పుడు ఎనిమిది సెకన్లకు పడిపోయింది. ఒక గోల్డెన్ ఫిష్ అటెన్షన్ స్పాన్ తొమ్మిది సెకన్లు. అంటే మనం దానికంటే ఘోరంగా ఉన్నామన్నమాట! రోజుకు ఐదుగంటల కన్నా ఎక్కువ స్క్రీన్ టైమ్ ఉన్న టీనేజర్లలో ఆత్మహత్య ఆలోచనలు లేదా తీవ్రమైన ఒత్తిడి వచ్చే అవకాశం 35 శాతం పెరిగినట్లు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ నివేదిక చెబుతోంది. ఆన్‌లైన్ గేమింగ్ అడిక్షన్ వల్ల 2025లో భారతీయ కుటుంబాలు దాదాపు 50 వేల కోట్ల రూపాయలకుపైగా నష్టపోయినట్లు అంచనా.

### బయటపడటం ఇలా...

ఈ 'అడిక్షన్ ఎకానమీ'లో మీ విలువైన జీవితాన్ని, సమయాన్ని తాకట్టు పెట్టకండి. ఈ రోజే మీ డిజిటల్ ప్రయాణాన్ని నియంత్రించుకోండి. స్మార్ట్‌ఫోన్ కంటే మీ స్మార్ట్‌నెస్ గొప్పదని నిరూపించండి! మీ ఫోన్ స్క్రీన్‌ను రంగులు లేకుండా 'బ్లాక్ అండ్ వైట్'లో మార్చండి. రంగులు లేకపోతే మెదడుకు ఆ దృశ్యాలు ఆకర్షణీయంగా అనిపించవు, తద్వారా ఫోన్ వాడకం 30 శాతం తగ్గుతుంది. ప్రతి 20 నిమిషాలకు ఒకసారి, 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును 20 సెకన్ల పాటు చూడండి. ఇది కంటి ఒత్తిడిని తగ్గించడమే కాకుండా, మెదడుకు చిన్న విరామాన్ని ఇస్తుంది. డైనింగ్ టేబుల్, బెడ్రూమ్‌లో ఫోన్‌ను అనుమతించకండి. ముఖ్యంగా నిద్రపోయే గంట ముందు ఫోన్‌ను పక్కన పెట్టడం వల్ల 'మెలటోనిన్' హార్మోన్ ఉత్పత్తి సక్రమంగా జరిగి గాఢ నిద్ర పడుతుంది. మీ ఫోన్లోని సెట్టింగ్స్‌లో 'డిజిటల్ వెల్--బీయింగ్' ఆప్షన్ ద్వారా ప్రతి యాప్‌కు సమయాన్ని కేటాయించుకోండి. సమయం ముగియగానే యాప్ లాక్ అయ్యేలా చూసుకోండి. ఖాళీ సమయం దొరకగానే ఫోన్ తీయకండి. ఆ ఖాళీ సమయాన్ని ఆలోచనల కోసం, ప్రకృతిని గమనించడం కోసం కేటాయించండి. సృజనాత్మకత ఎప్పుడూ ఖాళీ మెదడులోనే పుడుతుంది.

## నిందితుల్ని వదిలిపెట్టం.. అయోధ్య రామమందిరం విరాళాల స్కాంపై యూపీ సీఎం యోగి వార్నింగ్



**న్యూఢిల్లీ,:** ఉత్తర ప్రదేశ్, అయోధ్యలోని రామ మందిరంలో విరాళాలకు సంబంధించి అవకతవకలు జరిగినట్లు వెల్లడైన సంగతి తెలిసిందే. ఈ అంశంపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. నిందితులు ఎలాంటివారైనా, ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదని సీఎం హెచ్చరించారు. యోగి ఆదిత్యనాథ్ శుక్రవారం అయోధ్యలో పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. రామ భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ప్రజలు ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని ఆయన కోరారు. అలాగే, ఈ అంశంపై సిట్ దర్యాప్తు జరుపుతోందని, దీనికి సంబంధించి ఎవరివద్దనైనా ఆధారాలుంటే సిట్‌కు సమర్పించాలని ఆయన సూచించారు. ఆలయ ట్రస్ట్ వినతి మేరకు ఈ అంశంపై దర్యాప్తు జరిపేందుకు సిట్ ఏర్పాటు చేశామని, ఈ అంశంలోని విషయాల్ని సిట్ వెలుగులోకి తెస్తుందని భావిస్తున్నామని యోగి అన్నారు. భక్తులు కూడా ఆలయంపై జరుగుతున్న అనేక దుష్ప్రచారాలను నమ్మకుండా సహనంతో ఉండాలని, ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించే ప్రయత్నాలకు దూరంగా ఉంటూ, రాముడికి సంబంధించి గౌరవం, సహనం కలిగి ఉండాలని భక్తులను కోరారు. రామాలయ ఉద్యమాన్ని కాంగ్రెస్, ఎస్పీలు అడ్డుకుంటున్నాయని, గత ప్రభుత్వాలు రామ భక్తులకు, కర సేవకులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకున్నారని యోగి గుర్తు చేశారు. గతంలో అయోధ్యలో రామాలయ నిర్మాణాన్ని అడ్డుకున్న కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు ఇక్కడి ఆలయంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు నటిస్తోందని, ఇది ఆ పార్టీ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం అన్నారు. రామాలయ ఉద్యమాన్ని కూడా కోర్టులో కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందున్నారు. రామభక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయంటున్న సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) గతంలో కరసేవకులపై కాల్పులు జరపాలంటూ ఆదేశించిందని, జై శ్రీరామ్ అన్నవారిపై దళాల్ని ప్రయోగించిందంటూ యోగి విమర్శించారు. అయోధ్యలోని రామ మందిరానికి వచ్చిన విరాళాల విషయంలో అవకతవకలు, అక్రమాలు జరిగాయనే విషయం తాజాగా వెల్లడైంది. భక్తులు సమర్పించిన కానుకలు దేవాలయానికి చెందకుండా కొందరు సిబ్బంది కాజేశారని తేలింది. దీనిపై ప్రస్తుతం సిట్ దర్యాప్తునకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ విషయంలో కొన్ని ప్రాథమిక ఆధారాలు కూడా లభించాయి.

## నీట్ సూసైడ్ బాధిత కుటుంబాలకు కోటి పరిహారమివ్వండి: కాక్రోచ్ జనతా పార్టీ



న్యూఢిల్లీ: నీట్ పేపర్ లీకేజీ వల్ల కొందరు విద్యార్థులు మానసిక ఆందోళనకు గురవుతున్నారు. దేశవ్యాప్తంగా కొన్ని చోట్ల విద్యార్థులు ఆ టెన్షన్ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నారు. అయితే ఆ బాధిత కుటుంబీకులకు కోటి రూపాయలు పరిహారం ఇవ్వాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే.. ప్రధాని మోదీకి లేఖ రాశారు. ప్రవేశ పరీక్షల వివాదాల వల్ల ఆందోళనకు గురై ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారాన్ని ఇవ్వాలని దీప్కే డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణపై విద్యార్థుల్లో ఆందోళన నెలకొన్నదని, దీని వల్ల ఆ విద్యార్థుల మానసిక ఆరోగ్యం క్షీణిస్తున్నట్లు దీప్కే తన లెటర్‌లో ఆరోపించారు. మరో వైపు జూన్ 20వ తేదీన కాక్రోచ్ జనతా పార్టీ భారీ స్థాయిలో రెండో నిరసన ప్రదర్శనకు సిద్ధం అవుతున్నది. భారమైన హృదయంతో లేఖ రాస్తున్నానని, మన భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారిన ఈ అంశంపై మీరు తక్షణమే స్పందించాలని దీప్కే తన లేఖలో ప్రధానిని కోరారు. మన విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని వేడుకున్నారు. ఇటీవల దేశవ్యాప్తంగా 11 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. రీ-ఎగ్జామ్‌పై అపనమ్మకం ఏర్పడడం వల్ల విద్యార్థుల్లో ఆందోళన ఎక్కువైందన్నారు. జీవితం మొత్తం కష్టపడి పిల్లలను చదవిస్తే, ఆ కుటుంబాలు ఇప్పుడు పిల్లల్ని కోల్పోతున్నాయని దీప్కే తన లెటర్‌లో ఆరోపించారరు. పరీక్షల వత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారంగా కోటి ఇవ్వాలని దీప్కే డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని కోరారు. మరో వైపు జూన్ 21వ తేదీన నీట్-రీఎగ్జామ్‌ను నిర్వహించనున్న విషయం తెలిసిందే.

## వైఎస్సార్‌సీపీ పిటిషన్‌పై స్పందించిన హైకోర్టు

### ఫేస్‌బుక్ ఖాతా నిలిపివేయడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, మెటాకు నోటీసులు



అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారిక ఫేస్‌బుక్ ఖాతాను చంద్రబాబు ప్రభుత్వం కుట్రపూరితంగా బ్లాక్ చేయించడంపై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు మెటా సంస్థను ఆదేశించింది. వారికి నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వారిని ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ లీసా గిల్, జస్టిస్ రఘునందన్‌రావు ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. తమ పార్టీ అధికార ఫేస్‌బుక్ అకౌంట్‌ను బ్లాక్ చేయడాన్ని సవాలు చేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై గురువారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది సుబ్రమణ్య శ్రీరామ్ వాదనలు వినిపించారు. వైఎస్సార్‌సీపీ ఫేస్‌బుక్ అకౌంట్‌ను ఏకపక్షంగా బ్లాక్ చేశారని తెలిపారు. ఎవరు ఆదేశిస్తే బ్లాక్ చేశారో చెప్పడం లేదన్నారు. ఎలాంటి నోటీసు కూడా ఇవ్వలేదని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంలో మెటా ఏకపక్షంగా వ్యవహరించిందని ఆయన వివరించారు. ఐటీ చట్ట నిబంధనలను కాలరాసిందని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను ఆగస్ట్ 13కు వాయిదా వేసింది.

## గాంధీ సరోవర్‌కు రక్షణశాఖ గ్రీన్ సిగ్నల్.. రేవంత్ రెడ్డి ధన్యవాదాలు



హైదరాబాద్: గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినందుకు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రక్షణ మంత్రిత్వ శాఖ సహకారానికి తెలంగాణ ప్రభుత్వం తరుపున ధన్యవాదాలని పేర్కొన్నారు. మూసీ పునరుజ్జీవనలో గాంధీ సరోవర్ ప్రాజెక్టు కీలక మైలురాయిగా భావిస్తున్నామని .మూసీ పరివాహక ప్రాంతాన్ని సాంస్కృతిక ప్రజా వారసత్వ ఆస్తిగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా భారత రక్షణ శాఖ, భారత సైన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ బాపూ ఘాట్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టు నిర్మించబోతుంది.

# దాహార్తిని తీర్చే ప్రణాళికలేవి?



సంక్షోభాలు అకారణంగా రావు. అంచనాలున్నప్పుడూ, సమస్య అంతకంతకు ఉగ్ర రూపం దాలుస్తున్న వైనం కనబడుతున్నప్పుడూ మేల్కొంటే సకాలంలో వాటిని నివారించటం, అధిగమించటం వీలవుతుంది. కానీ మన పాలకుల విధానాలన్నీ దాహం వేసిన పుడు బావి తవ్విన చందాన ఉంటున్నాయి. అందువల్లే ఈ వేసవిలో దేశంలోని మహా నగరాలన్నీ కనీ వినీ ఎరుగని నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. ప్రపంచ జనాభాలో మన వాటా 18 శాతం. కానీ ప్రపంచ నీటి వనరుల్లో వాటా కేవలం 4 శాతం మాత్రమే. ఇంత వ్యత్యాసం ఉన్నప్పుడు నీటి వనరుల సంరక్షణ విషయంలో మొదటినుంచీ ఎంత జాగ్రత్తగా ఉండాలో చెప్పనవసరం లేదు. వాతావరణ మార్పులు ఒక్కటే కాదు... భూగర్భ జలాల వినియోగంలో జాగ్రత్తలు పాటించకపోవటం, నగర పట్టణ ప్రాంతాల్లో నీటిని కాస్తయినా పట్టింపు లేకుండా వృథా చేయటం వంటివి సైతం సమస్యను ఉగ్ర రూపం దాల్చేలా చేస్తున్నాయి. ప్రపంచం నీటి కొరత, ఎద్దడి, సంక్షోభం దశల్ని దాటి ఇప్పుడు నీటి దివాలా(పునరుత్పాదకతకు వీల్లేనివిధంగా పూర్తిగా అడుగంటడం) వరకూ వచ్చిందని ఐక్యరాజ్యసమితి విశ్వవిద్యాలయ జల, పర్యావరణ, ఆరోగ్య సంస్థ ఈమధ్య ప్రకటించింది. అయితే దీన్నుంచి తప్పించుకోవటానికి ఇప్పటికీ మార్గాలున్నాయి. గండం గట్టెక్కడానికి తోచినవిధంగా చేసుకుపోవటం బదులు పారదర్శక విధానాలు పాటించటం అవసరమని ఆ సంస్థ సూచించింది. ఒక ప్రణాళికాబద్ధంగా సహజ నీటివనరుల రీచార్జ్‌కి అనుసరించాల్సిన మార్గాలేమిటో నిర్ధారించుకోవటం, వాగులు, వంకలు, జలాశ యాలు నిండటానికి దోహదపడే కొండలు, గుట్టల్ని ప్రాణప్రదంగా కాపాడుకోవటం అవసరమని నిపుణులంటున్నారు. ప్రపంచంలో 70 శాతం జలాశయాలు క్రమేపీ క్షీణిస్తు న్నాయనీ, 400 కోట్లమంది ప్రజలు ఏడాదిలో కనీసం ఒక నెలపాటు నీటి ఎద్దడి ఎదు ర్కొంటున్నారనీ సమితి విశ్వవిద్యాలయం అంటున్నది. తీవ్ర నీటి కొరత ఎదుర్కొంటున్న నగరాల్లో ఢిల్లీ, కోల్‌కతా చెన్నై, బెంగళూరులతోపాటు హైదరాబాద్ కూడా ఉంది. ఈ నీటి కొరత ప్రజారోగ్యానికి కూడా ముప్పు కలిగిస్తోంది. 14 యేళ్లలోపున్న 80 లక్షల మంది బాలలు తాగునీటి నాణ్యత నాసిరకంగా ఉండటంవల్ల అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని సంస్థ నివేదిక చెబుతోంది. నీటి ఎద్దడిని వర్షాలు సరిగా పడకపోతే వచ్చే సమస్యగానే ఇంకా మన పాలకులు చూస్తున్నారు. కానీ సరిగా అధ్యయనం చేస్తే దీని మూలాలు మరెక్కడో ఉన్నాయని అర్థమవుతుంది. నగరాలు తమ స్థోమతకు మించి విస్తరిస్తున్నాయి. అంతో ఇంతో ఉపాధి కల్పించే సంస్థలన్నీ అక్కడే కేంద్రీకృతం కావటంతో అనివార్యంగా అందరూ నగరాల బాట పట్టాల్సివస్తోంది. కానీ మౌలిక సదుపాయాలు ఇంతమందిని తట్టుకోగల స్థాయిలో లేక సహజంగానే సంక్షోభం ముదురుతుంది. ఉన్న నీటి వనరులేమిటి... వాటి సమర్థ వినియోగానికి మార్గాలేమిటన్న అంశాలపైకాక, కొత్త వనరుల అన్వేషణపై దృష్టి కేంద్రీకరించటం సమస్య తీవ్రతను పెంచుతోంది. భూగర్భ జలాల వినియోగంపై నియంత్రణలు, వ్యర్థ జలాల శుద్ధి అంశాల్లో ప్రభుత్వాలకు సరైన ప్రణాళికలు లేవు. వ్యర్థ జలాలు, పారిశ్రామిక వ్యర్థాలు చెరువుల్లో, నదుల్లో కలుస్తున్నా పట్టకపోవటంతో చివరకు భూగర్భజలాలు కూడా కలుషితమవుతున్నాయి. వచ్చే 2030 నాటికి అందుబాటులో ఉండే నీటి లభ్యతతో పోలిస్తే రెండు రెట్లు అధిక డిమాండ్ ఉంటుందని నీతి ఆయోగ్ సంస్థ చెబుతున్న జోస్యం అందరినీ భయపెడుతోంది. మూడు నాలుగు నెలలపాటు ఉండాల్సిన రుతుపవనాలు చుట్టం చూపుగా వచ్చి పోవటం రివాజుగామారి చాన్నాళ్లవుతోంది. ఈసారి ముంచుకొస్తున్న సూపర్ ఎల్‌నినో సరేసరి. గంగ, సింధు, బ్రహ్మపుత్ర నదులను నింపే హిమాలయాల్లోని మంచుదిబ్బలు వేగంగా కరుగుతూ వెంటనే వరదలకూ, అటుపై నీటి కొరతకూ కారణమవుతున్నాయి. అందుకే చైనా, సింగపూర్ వంటి దేశాలు నీటి వనరుల రక్షణకూ, వాన నీటి సేకరణకూ, వ్యర్థ జలాల వినియోగానికీ అనుసరించే విధానాలను అధ్యయనం చేసి మన దగ్గర కూడా అమలు చేయాలి. నీటి వినియోగంపై సమగ్రమైన నిబంధనలకు రూపకల్పన చేయాలి. వానాకాలంలో వరదల్లో మునిగి, వేసవిలో ఎడారులుగా మారే నగరాలు మనకొద్దని ప్రతినబూనాలి.

# ఎట్టకేలకు శాంతి దిశగా...



అమెరికా--ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం ఖరారు దిశగా తొలి అడుగు పడింది. ఫ్రాన్స్‌లోని ప్యాలెస్ ఆఫ్ వెర్సాయ్‌లో ఈ ఒప్పందానికి సంబంధించిన అవగాహన పత్రం (ఎంఓయూ)పై స్థానిక కాలమానం ప్రకారం బుధవారం రాత్రి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సంతకాలు చేశారు. ఇద్దరూ పరస్పరం వేల కిలోమీటర్ల దూరంలో ఉండి ఈ తంతు ముగించడాన్నిబట్టే ఆ రెండు దేశాలమధ్యా ఉన్న వైషమ్యాల తీవ్రతేమిటో తెలుస్తుంది. మొదట ట్రంప్ సంతకం చేసి ఆన్‌లైన్‌లో పంపిన ఎంఓయూ నకలు తీసుకుని దానిపై పెజెష్కియాన్ సంతకం చేశారు. ఈ వారం ఆఖరులో జెనీవాలో ఈ సంతకాల కార్యక్రమం ఉంటుందని తొలుత ప్రకటించినా, ఎందుకనో అంతా మారింది. అనుసరించిన విధానం ఏమైనా, ఇకపై పశ్చిమాసియా ప్రశాంతంగా ఉంటే అదే పదివేలని ప్రపంచ ప్రజానీకమంతా ఆరాట పడుతున్నది. తుది ఒప్పందానికి రావటం కోసం రాగల అరవై రోజుల వ్యవధిలో అమెరికా, ఇరాన్ రెండూ ఏమేం చేయాలో ఈ 14 అంశాల ఎంఓయూలో ఉంది. ఇతరత్రా అంశాల మాటెలావున్నా హార్ముజ్ ప్రతిష్ఠంభనకు తెరపడటం, అణ్వాయుధాల జోలికిపోనని ఇరాన్ హామీ ఇవ్వటం ప్రధానమైనవి. లెబనాన్‌లో ఇజ్రాయెల్ సాగించే హత్యాకాండను ఆపటంతోసహా అన్ని రకాల యుద్ధాలూ పరిసమాప్తం చేయటం, ఇరాన్ పునర్నిర్మాణానికి అమెరికా, ఈ ప్రాంత భాగస్వామ్య దేశాలూ 30,000 కోట్ల డాలర్ల నిధిని సమకూర్చటం, ఇరాన్ చమురు విక్రయాలపై అమెరికా ఆంక్షల తొలగింపుపై విధివిధానాలు వెల్లడించటం కూడా ఇందులో భాగమే. 30 రోజుల్లో ఇరాన్ సమీపంలోని అమెరికా నౌకలన్నీ నిష్క్రమిస్తాయనీ, యుద్ధ ప్రారంభానికి ముందున్న పరిస్థితులు పునరుద్ధరిస్తారనీ ఎంఓయూ చెబుతోంది. అయితే ఇప్పటికే 60 శాతం అభివృద్ధి చేసిన యురేనియం విషయంలో ఇరాన్ ఏం చేయాలో ఇరు దేశాలూ చర్చించుకుంటాయి. ఇజ్రాయెల్‌తో కుమ్మక్కయి అకారణంగా, ఏకపక్షంగా ప్రారంభించిన ఈ యుద్ధాన్ని ఎటు తీసుకుపోవాలో, 'గౌరవప్రదంగా' ఎలా బయటపడాలో దిక్కుతోచని అమెరికాకు ఇప్పుడు అన్నివిధాలా గర్వభంగమైంది. చిత్రమేమంటే... ఒకే లక్ష్యంతో ఈ ఊబిలోకి దిగిన మిత్రులు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూలిద్దరికీ కొద్ది రోజుల్లోనే మార్గాలు వేరయ్యాయి. ఈ యుద్ధాన్ని తక్షణం వదుల్చుకుంటే తప్ప ఏడాది ఆఖరుకల్లా దేశంలో జరిగే మధ్యంతర ఎన్నికల్లో తుడిచిపెట్టుకుపోవటం ఖాయమని ట్రంప్‌కు అర్థమైతే... ఇది కొనసాగుతుంటే తప్ప ఏడాది చివరన జరిగే పార్లమెంటు ఎన్నికల్లో గెలుపు అసాధ్యమని నెతన్యాహూ లెక్కలేసుకున్నారు. ఆయన సమస్యేమిటో ట్రంప్‌కు తెలియకపోలేదు. కానీ మిత్రత్వం కంటే స్వీయ పీఠ సంరక్షణే ప్రధానమని ఆయన గ్రహించారు. అందుకే విధి లేని స్థితిలో ఈ ఒప్పందానికొచ్చారు. హార్ముజ్ మూతతో అమెరికాలో గ్యాసోలిన్ ధరలు మిన్నంటాయి. ద్రవ్యోల్బణం హద్దులు దాటింది. సరుకుల కొరత ఏర్పడింది. ఒబామా హయంలో ఇంతకంటే మెరుగ్గా కుదిరిన ఒప్పందాన్ని బుట్టదాఖలు చేసిన ట్రంప్, దీనికెలా అంగీకరించారన్న కథనం ఆసక్తికరమైనది. దౌత్యంలో దేశాల అధినేతలు అవతలి పక్ష సైనిక, ఆర్థిక, భౌగోళిక రాజకీయ స్థితిగతుల్ని విశ్లేషించగల నిపుణుల సాయం తీసుకుంటారని చెబుతారు. కానీ ఇరాన్ మరో అడుగు ముందుకేసి మానసిక ఆరోగ్య నిపుణుల్ని కూడా ఇందులో చేర్చిందంటున్నారు. ట్రంప్ ప్రకటనల్ని, క్షణక్షణానికి మారే ఆయన వైఖరుల్ని గమనిస్తూ ఎలా మాట్లాడితే బోధపరుచుకుని సానుకూలంగా స్పందిస్తాడో వారు సలహాలిచ్చారని దాని సారాంశం. ట్రంప్ తీరుతెన్నులు గమనిస్తే అది నిజమే అనిపిస్తుంది. తన కనుసన్నల్లో ఖరారైన ఎంఓయూ తనకి నచ్చకుంటే మళ్లీ బాంబులేయటానికి వెనకాడనని ఆయనే చెప్పటాన్ని గమనిస్తే ట్రంప్‌ను ఇరాన్ సరిగానే అంచనా వేసిందనుకోవాలి. పారిస్ వెలుపలనున్న ప్యాలెస్ ఆఫ్ వెర్సాయ్ రాచరిక ఉత్థాన పతనాలు చూసింది. ఫ్రెంచ్ విప్లవాన్నీ, దానిలోని ప్రజాస్వామిక ఆకాంక్షలనూ గమనించింది. 1783లో బ్రిటన్, ఫ్రాన్స్, స్పెయిన్‌ల సరిహద్దు తగాదాలపై ఒడంబడికకు సాక్షిగా నిలిచింది. జర్మనీని అవమానకరమైన ఒప్పందంతో శాసించి, 1919లో మొదటి ప్రపంచ యుద్ధాన్ని ముగించిందీ ఇక్కడే. కానీ అమెరికాకు ఇప్పుడెదురైన అవమానం స్వచ్ఛందం, స్వయంకృతం. ఇన్నింటికి వేదికైన చోట కుదిరిన ఈ ఎంఓయూను ట్రంప్ గౌరవిస్తారని ఆశించాలి.

# ఖరీఫ్‌కు ముందే కష్టాలు!

యాసంగి సన్న ధాన్యానికి రావాల్సిన బోనస్‌లో రూ.700 కోట్లు ఇప్పటికీ రాలేదు.. ఇంతలో ప్రభుత్వం గుర్తించిన 7 రకాల వరి వంగడాలకే ఈసారి బోనస్ పరిమితమంటూ ప్రకటించింది. మరి.. ఆ రూ.700 కోట్లు ఇక రానట్టేనా? యాసంగి రైతు భరోసా రూ.9 వేల కోట్లు అని చెప్పినా.. అది రూ. 5,653 కోట్లకే పరిమిత మైంది.. ఈ నెల 30న ఈ ఖరీఫ్ రైతు భరోసా నిధులు జమచేస్తామంటూ కేబినెట్ భేటీ అనంతరం సర్కారు ప్రకటించింది.యాసంగి రైతు భరోసాకు మంగళం పాడినట్టేనా?

### అన్నదాతల అవస్థలు..

రైతన్నకు దెబ్బమీద దెబ్బ పడుతోంది. ఇప్పటికే పెరిగిన ఎరువుల ధరలు, ట్రాక్టర్ అద్దెల భారం, కూలీల కొరత, ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ హెచ్చరికలు అన్నదాతను ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా.. వీటికి తాజా కష్టాలు తోడయ్యాయి. అటు రైతు బీమాలో భాగంగా ఎల్ఐసీకి ప్రీమియం చెల్లింపులో ఆలస్యం జరగడంతో అన్నదాతల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి.

### ఏడు రకాల వరికే బోనస్

గత రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం సన్న ధాన్యం సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహించింది. ప్రజలకు సన్నబియ్యం పంపిణీ, రైతులకు అదనపు ఆదాయం అనే లక్ష్యాలతో క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ను ప్రకటించింది. ప్రభుత్వం ఇచ్చిన భరోసాతో లక్షలాది మంది రైతులు దొడ్డు బియ్యం స్థానంలో సన్నాల సాగుకు మొగ్గు చూపారు. యాసంగి సీజన్‌లో ఉత్తర తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో సన్నాలకు వాతావరణం అనుకూలించకపోయినా వ్యయ ప్రయాసల కోర్చి రైతులు పెద్ద ఎత్తున సాగు చేశారు. అయితే గత యాసంగిలో కొనుగోలు చేసిన దాదాపు 14 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యానికి సంబంధించిన బోనస్ సుమారు రూ.700 కోట్లు ఇప్పటికీ రైతుల ఖాతాల్లో జమ కాలేదు. వానాకాలం సీజన్ రావడంతో ఇక యాసంగి బోనస్‌ను వదులుకున్నట్టే. 2024--25 యాసంగిలో కూడా దాదాపు 24 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యాన్ని విక్రయించిన రైతులకు చెల్లించాల్సిన బోనస్ రూ.1,159 కోట్లను ఇవ్వలేదు. కాగా, ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం రైతాంగాన్ని ఆందోళనకు గురి చేస్తోంది. ఇకపై ప్రభుత్వం గుర్తించిన ఏడు రకాల వరి వంగడాలకు మాత్రమే బోనస్ వర్తిస్తుందని సర్కారు ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ అంచనా ప్రకారం 38.19 లక్షల ఎకరాల్లో ఈ ఏడు రకాల సన్నాలను సాగు చేయనున్నారు. దీనికి అవసరమైన విత్తనాల పరిమాణం 9.55 లక్షల క్వింటాళ్లుగా పేర్కొన్న ప్రభుత్వం.. 15.64 లక్షల క్వింటాళ్లు అందుబాటులో ఉన్నట్టు చెబుతోంది. అయితే అందులో దాదాపు 13 లక్షల క్వింటాళ్ల విత్తనాలు ప్రైవేట్ వ్యాపారుల వద్దనే ఉండడం గమనార్హం. ఇందులో ఇప్పటికే 2 లక్షల క్వింటాళ్లను రైతులకు విక్రయించినట్టు వ్యవసాయశాఖ తాజా నివేదికలో వెల్లడించింది. తెలంగాణ సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వద్ద కేవలం నాలుగు రకాల విత్తనాలు 38 వేల క్వింటాళ్లు మాత్రమే ఉండగా, జాతీయ విత్తన సంస్థ (ఎన్ఎస్‌సీ) వద్ద కేవలం 4,838 క్వింటాళ్లు మాత్రమే ఉన్నాయి. రైతులు సన్నాల కోసం ప్రైవేటు వ్యాపారుల వద్దకు వెళ్లక తప్పని పరిస్థితి ఏర్పడింది.



### రైతుబీమా ఆలస్యం...

రైతు బీమా డబ్బు అందక వేలాది కుటుంబాలు ఆందోళనలో ఉన్నాయి. 2025--26 సంవత్సరానికి గాను రైతుబీమా ప్రీమియం కింద ఎల్ఐసీకి రూ.1,359 కోట్లు చెల్లించాల్సి ఉండగా, రూ.436 కోట్లు ఆలస్యంగా చెల్లించినట్టు తెలిసింది. ప్రభుత్వం ప్రీమియం ఆలస్యంగా చెల్లించిన కారణంగా ఈ ఏడాది చనిపోయిన 7,606 రైతులకు సంబంధించిన రైతు బీమాను ఎల్ఐసీ ఇంకా విడుదల చేయలేదు. మరణించిన రైతు కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందలేదు.

### 2 ఎకరాలకే పరిమితమైన రైతుభరోసా

సాగు యోగ్యమైన భూములన్నింటికీ రైతుభరోసా కింద ప్రతి సీజన్‌కు ఎకరానికి రూ.6,000 చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్టు ప్రకటించిన ప్రభుత్వం.. గత యాసంగిలో రాష్ట్రంలోని 71.05 లక్షల రైతుల ఖాతాల్లో రెండు ఎకరాలకు మాత్రమే రూ.5,653 కోట్లను ప్రభుత్వం జమ చేసింది. మార్చి 19న తొలి విడతగా రూ.3,446.94 కోట్లు, రెండో విడతగా రూ.2,206.06 కోట్లను జమచేసింది. రూ.9 వేల కోట్లు రైతుభరోసా కింద చెల్లించనున్నట్టు ప్రకటించినా, రూ.5,653 కోట్లకే పరిమితం చేశారు. ఈ నెల 30న మధిరలో వచ్చే ఖరీఫ్ కోసం రైతుభరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో యాసంగి రైతుభరోసా కథ ముగిసిపోయిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

శివసూర్య
తెలుగు దిన పత్రిక
RNI APTEL : 2023/88704
శనివారం - 20 - జూన్ - 2026

# 5జీ యూజర్లు 110 కోట్లు!




### 2031 నాటికి మొత్తం కనెక్షన్లలో 81 శాతానికి వాటా
### 70 జీబీకి నెలవారీ డేటా వాడకం
### భారత్ టెలికం మార్కెట్‌పై ఎరిక్సన్ నివేదిక

న్యూఢిల్లీ: వచ్చే ఆరేళ్లలో 2031 నాటికి భారత్‌లో 5జీ యూజర్ల సంఖ్య 110 కోట్లకు చేరనుంది. మొత్తం కనెక్షన్లలో 5జీ వాటా 81 శాతానికి చేరనుంది. స్వీడన్‌కి చెందిన టెలికం పరికరాల తయారీ సంస్థ ఎరిక్సన్ రూపొందించిన నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. 2025 ఆఖరు నాటికి దేశీయంగా 5జీ యూజర్ల సంఖ్య 43 కోట్లకు, మొత్తం మొబైల్ సబ్ స్క్రిప్షన్లలో వాటా 35 శాతానికి చేరిందని రిపోర్టు పేర్కొంది. మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ మెరుగుపడటంతో 5జీ వినియోగం గణనీయంగా పెరుగుతోందని ఎరిక్సన్ ఇండియా ఎండీ నితిన్ బన్సల్ తెలిపారు. భారీ స్థాయిలో సమ్మిళితత్వం, గవర్నెన్స్, ఆవిష్కరణలకు పటిష్టమైన, సురక్షితమైన 5జీ మౌలిక సదుపాయాలు తోడ్పడుతున్నాయని, డిజిటల్ ఇండియాకి శక్తివంతమైన పునాది వేస్తున్నాయని వివరించారు. ఈ క్రమంలో కస్టమర్లను ఆకర్షించేందుకు కంపెనీలు వైవిధ్యమైన సర్వీసులను కూడా ప్రవేశపెడుతున్నాయని నివేదిక పేర్కొంది. నేరుగా ఎయిర్‌టెల్‌ని ప్రస్తావించకుండా, పోస్ట్‌పెయిడ్ 5జీ కస్టమర్లకు ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న సందర్భాల్లోనూ మెరుగైన సేవలు అందేలా ఓ టెలికం కంపెనీ .. నెట్‌వర్క్ స్లైసింగ్ ఇటీవలే వైవిధ్యమైన కనెక్టివిటీ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు వివరించింది.

**నివేదికలోని మరిన్ని విశేషాలు..**

డివైజ్‌లు చౌకగా లభిస్తుండటం, నెట్‌వర్క్ కవరేజీ విస్తృతంగా ఉండటం, ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్ (ఎఫ్‌డబ్ల్యూఏ) సేవలు అందుబాటులోకి వస్తుండటంతో 5జీ వినియోగం భారీగా పెరుగుతోంది. చాలా మటుకు సర్వీస్ ప్రొవైడర్లకు సంబంధించి డౌన్‌లింక్ కన్నా అప్‌లింక్ ట్రాఫిక్ వేగంగా పెరుగుతోంది.

ప్రతి స్మార్ట్‌ఫోన్‌పై మొబైల్ డేటా వినియోగం విషయంలో గ్లోబల్‌గా భారత్ అగ్రస్థానంలో ఉంటోంది. నెలవారీ యూసేజీ సగటున 37 జీబీగా ఉండగా, 2031 నాటికి 70 జీబీకి చేరనుంది.

46 శాతం వాటాతో 4జీ ఇప్పటికీ ప్రధాన టెక్నాలజీగానే కొనసాగుతున్నప్పటికీ దాని వినియోగం క్రమంగా తగ్గుతోంది. 2025లో 57 కోట్లుగా ఉన్న యూజర్ల సంఖ్య 2031 నాటికి 16 కోట్లకు పడిపోనుంది.

అంతర్జాతీయంగా 5జీ మొబైల్ సబ్ స్క్రిప్షన్ల సంఖ్య 2026 తొలి త్రైమాసికంలో తొలిసారిగా మూడు వందల కోట్ల మార్కును దాటింది. ఈ ఏడాది మొదటి క్వార్టర్‌లో గ్లోబల్‌గా 16.2 కోట్ల కొత్త 5జీ కనెక్షన్లు జత కావడంతో మొత్తం సబ్‌స్క్రిప్షన్ల సంఖ్య 310 కోట్లకు చేరింది. ఇది 2031 నాటికి రెట్టింపు కన్నా అధిక స్థాయికి (640 కోట్లు) చేరనుంది.

ఇప్పటివరకు 390 సర్వీస్ ప్రొవైడర్లు కమర్షియల్ 5జీ సర్వీసులు ప్రారంభించాయి. 90కి పైగా సంస్థలు 5జీ సేవలను స్టాండెలోన్ ప్రాతిపదికన ప్రవేశపెట్టాయి.

2025 ఆఖరు నాటికి మొత్తం మొబైల్ డేటా ట్రాఫిక్‌లో 48 శాతం వాటా 5జీ నెట్‌వర్క్‌లదే ఉంది. 2031 ఆఖరు నాటికి ఇది 85 శాతానికి చేరొచ్చని అంచనా.

పశ్చిమ యూరప్, ఉత్తర అమెరికా, ఈశాన్య ఆసియా, గల్ఫ్ దేశాల్లో 5జీ సేవల వినియోగం 2031 నాటికి 90 శాతానికి చేరవచ్చు.

ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్ (ఎఫ్‌డబ్ల్యూఏ)కి సంబంధించి వేగం ఆధారిత టారిఫ్ ప్లాన్ల ద్వారా వివిధ మార్కెట్ వర్గాలను ఆకట్టుకునే ప్రయత్నాలను టెల్కోలు కొనసాగిస్తాయి.

మొత్తం ఎఫ్‌డబ్ల్యూఏ సర్వీస్ ప్రొవైడర్లలో 5జీ ద్వారా సేవలందించే సంస్థల వాటా 71 శాతానికి చేరింది. 2025 జూన్‌లో ఇది 57 శాతంగా ఉంది. స్పీడ్ ఆధారిత టారిఫ్ ప్లాన్లను అందించే ఎఫ్‌డబ్ల్యూఏ సర్వీస్ ప్రొవైడర్ల సంఖ్య గతేడాది 51 శాతంగా ఉండగా ప్రస్తుతం 57 శాతానికి చేరింది.

# జెన్-ఆల్ఫాకి ఎప్పటికీ దీని గురించి తెలియకపోవచ్చు!




జెన్-ఆల్ఫా (2010 నుంచి 2025 మధ్య జన్మించిన వారు) పెరుగుతున్న ప్రపంచంలో స్క్రీన్‌లు, స్మార్ట్ డివైస్‌లు జీవితంలో సహజ భాగాలు. వారికి ఇంటర్నెట్ లేకుండా గడిచిన రోజులు కథల్లో వినే విషయాల్లా అనిపించే అవకాశం ఉంది. డిజిటల్ కనెక్షన్ ఎప్పుడూ అందుబాటులో ఉండటంతో "ఆఫ్‌లైన్ జీవితం" అనే భావనే ఈ కొత్త తరానికి అపరిచితంగా మారుతోంది. జెన్ ఆల్ఫా వాళ్లు ఇంటర్నెట్, డిజిటల్ పరికరాలను వాడుతూనే పెరుగుతున్నారు. అది వారి రోజువారీ జీవితంలో సహజ భాగంగా మారిపోయింది. వారు చదవడం, వినోదం పొందడం, కొత్త విషయాలు తెలుసుకోవడం, విసుగొచ్చినప్పుడు లేదా ఒంటరిగా అనిపించినప్పుడు మాట్లాడడం వంటి పనులన్నీ ఎక్కువగా డిజిటల్ పరికరాలు, ఆన్‌లైన్ వేదికల ద్వారానే చేస్తున్నారు. అంతకుముందున్న తరాలవారికి ఆన్‌లైన్‌లో ఉండటం ఒక కార్యకలాపం. వారు లాగిన్ అయ్యేవారు, అంతర్జాలంలో కొంత సమయం గడిపేవారు, తర్వాత లాగ్ ఆఫ్ అయ్యేవారు. జెన్ ఆల్ఫాకు మాత్రం ఇంటర్నెట్ అనేది వారు పెరిగే వాతావరణంగా మారిపోయింది. జెన్ ఆల్ఫా తరం కంటే ముందు ఉన్న తరాలు ఇంటర్నెట్ లేకుండా కూడా జీవితాన్ని గడిపాయి. ప్రత్యక్షంగా మనుషులను కలుసుకోవడం, బయట ఆటలు ఆడటం, పుస్తకాల ద్వారానే సమాచారం తెలుసుకోవడం వంటి "ఆఫ్‌లైన్" జీవన విధానాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేని తొలి తరంగా జెన్ ఆల్ఫా తరం మారవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. అంటే ఇంటర్నెట్ లేని జీవితం ఎలా ఉండేదో జెన్ ఆల్ఫా వారికి పూర్తిగా తెలియకపోవచ్చు. అంటే పిల్లల జీవితంలోని అన్ని దశల్లో, అన్ని విధాలుగా వర్చువల్ సంస్కృతి పెరుగుతోంది. డిజిటల్ ప్రపంచంలో జరిగే సామాజిక, విద్యా, వినోద కార్యకలాపాలకే వారు పరిమితం అవుతున్నారు. జెన్ ఆల్ఫాకు సాంకేతికత కేవలం వినోదం లేదా అభ్యాసానికి ఉపయోగించే సాధనం కాదు. సమాచారం పొందడం, సంభాషించడం, తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అనుభవించడం వంటి విషయాల్లో అది ప్రధాన మార్గంగా మారుతోంది.

**బ్లాక్‌బోర్డుల నుంచి స్మార్ట్‌బోర్డుల వరకు..**

కొన్ని సంవత్సరాలు వెనక్కి వెళ్తే.. మనం బ్లాక్‌బోర్డులను ఉపయోగించేవాళ్లమని గుర్తుకు వస్తుంది. ఉపాధ్యాయులు బోర్డులపై రాసేవారు. విద్యార్థులు వాటిని కాపీ చేసేవారు. యువతపై ప్రభావం చూపుతూ వేగవంతమైన సాంకేతికత ప్రపంచాన్ని వేగంగా మార్చేస్తోంది. 2025లో భారత్‌లోని స్కూళ్లలో తరగతి గదుల??లో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. బ్లాక్‌బోర్డుల స్థానంలో స్మార్ట్‌బోర్డులు వచ్చాయి. ఇప్పుడు విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించడానికి ఎక్కువగా రాయడం లేదు. వీడియోలు చూపిస్తున్నారు, పీడీఎఫ్‌లు తెరిచి బోధిస్తున్నారు. మన తల్లిదండ్రులు మన చిన్నతనంలో చెప్పిన "ఫోన్ ఎక్కువగా చూడొద్దు, కళ్లపై ప్రభావం పడుతుంది" లేదా "స్క్రీన్ సమయం తగ్గించు" అనే మాటలు ఇప్పుడు పనిచేయడం లేదు. ఒకప్పుడు దృష్టి మళ్లించే వస్తువులుగా భావించిన అదే స్క్రీన్లు ఇప్పుడు తరగతి గదులు, గ్రంథాలయాలు, చదువులో భాగస్వాములుగా మారాయి.

**బియ్యం బస్తాల్లా బ్యాగులు ఉండేవి కదా..**

పాఠశాల బ్యాగు పరిస్థితి మీకు గుర్తుండే ఉంటుంది. బియ్యం బస్తాల్లా బ్యాగులను మోసుకెళ్లేవాళ్లం. 6వ తరగతికే వెన్నునొప్పి వచ్చేది. ఐదారు సబ్జెక్టుల పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు ఉండేవి. జెన్ ఆల్ఫా పిల్లల సంగతే వేరు. తేలికైన బ్యాగులు ఉంటున్నాయి. కొన్ని స్కూళ్లకు పిల్లలు బ్యాగులు లేకుండానే వెళ్తున్నారు. ఎందుకంటే పాఠ్యపుస్తకం ఇప్పుడు పీడీఎఫ్ రూపంలో ఉంది. నోట్స్ గూగుల్ డాక్‌లో ఉన్నాయి. హోం వర్క్ గూగుల్ క్లాస్‌రూమ్‌లో ఇస్తున్నారు. చదువుకు సంబంధించిన అనేక విషయాలు వాట్సాప్ గ్రూపుల్లో లింక్ రూపంలో వస్తున్నాయి. అన్నీ టాబ్లెట్ లేదా ల్యాప్‌టాప్‌లోని ఒక ఫోల్డర్‌లో క్రమబద్ధంగా, సెర్చ్ చేయడానికి సులభంగా ఉంటాయి. గత తరాలు పుస్తకాలను చదవడం నేర్చుకున్నాయి. నేటి విద్యార్థులు వీడియోలు, సామాజిక మాధ్యమాలు, ఆగ్మెంటెడ్ రియాలిటీ, కృత్రిమ మేధస్సు ద్వారా ప్రపంచాన్ని అర్థం చేసుకోవడం నేర్చుకుంటున్నారు. ఆగ్మెంటెడ్ రియాలిటీ అంటే డిజిటల్ చిత్రాలు, సమాచారం జోడించి చూపే సాంకేతికత. జెన్ ఆల్ఫా, స్క్రీన్ల మధ్య బంధం ఇప్పటికే పెరుగుతుండగా, కోవిడ్-19 మహమ్మారి దాన్ని మరింత వేగవంతం చేసింది. దాదాపు మూడు సంవత్సరాలు విద్యార్థులు ఇళ్లకే పరిమితమయ్యారు. తరగతులకు హాజరయ్యారు, పరీక్షలకు సిద్ధమయ్యారు, అసైన్‌మెంట్‌లు సమర్పించారు, స్నేహ సంబంధాలు కూడా పరికరాల ద్వారానే కొనసాగించారు. స్క్రీన్లు ఆప్షన్‌గా కాకుండా అత్యవసరంగా మారాయి. దీనిలో ఉన్న మంచి విషయం నిజమే. వీడియోలో అగ్నిపర్వత విస్ఫోటనాన్ని చూసే పిల్లవాడు లేదా రంగులతో కూడిన కిరణజన్య సంయోగక్రియ చలనచిత్రాన్ని చూసే పిల్లవాడు... బోర్డుపై గీసిన చాక్ చిత్రాన్ని చూసే పిల్లవాడితో పోల్చితే దాన్ని భిన్నంగా అర్థం చేసుకుంటాడు. ఇప్పుడు "పుస్తకం ఇంట్లో మరిచిపోయాను" అనే మాట లేదు. "అన్నీ నా చేతిలోనే ఉన్నాయి" అనే పరిస్థితి వచ్చింది. విద్యార్థులు అదే స్క్రీన్‌పై వారు యూట్యూబ్ చూస్తారు, స్నేహితులతో సంభాషిస్తారు. జెన్ ఆల్ఫా పిల్లవాడికి ఏదైనా అర్థం కాకపోతే పేరాను మళ్లీ చదవడు.. వీడియో కోసం వెతుకుతాడు. అది 8 నిమిషాల కంటే ఎక్కువ ఉంటే, అవసరమైన భాగానికి నేరుగా వెళ్లిపోవచ్చు. ఇప్పుడు దాదాపు ప్రతి ప్రశ్నకు వెంటనే సమాధానం లభిస్తుంది. మిలీనియల్స్, జెన్ జెడ్ తరాలకు ఆఫ్‌లైన్‌లో ఉండటం రోజువారీ జీవితంలో సాధారణ భాగం. జెన్ ఆల్ఫాకు "ఆఫ్‌లైన్" క్రమంగా ఒక అనుభవం కంటే ఒక భావనగా మారవచ్చు. వారు దాని గురించి వింటారు గానీ, తరచుగా అనుభవించకపోవచ్చు.

# జాబ్స్ కాదు.. ఏఐతో ఇంకా చాలా పోవచ్చు: సత్య నాదెళ్ల




కృత్రిమ మేధ (ఏఐ) మనుషుల ఉద్యోగాలను తినేస్తుందనే భయాలు ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీస్తున్నాయి. అయితే మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల మరింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏఐ వల్ల సృష్టించే విలువ, సంపద, జ్ఞానం అన్నీ కొద్ది కంపెనీల చేతుల్లోనే కేంద్రీకృతమైతే ఏం జరుగుతుందో చెబుతూ ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఉద్యోగాలు పోవడమే కాదు.. అంతకు మించిన ముప్పు పొంచి ఉందని అంటున్నారాయన. ఏఐ వల్ల వచ్చే లాభాలు, జ్ఞానం, వ్యాపార విలువ అంతా కొద్ది కంపెనీల చేతుల్లోనే కేంద్రీకృతమవడం అసలు ముప్పని సత్య నాదెళ్ల హెచ్చరిస్తున్నారు. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో చేసిన సుదీర్ఘ పోస్టులో నాదెళ్ల.. ఏఐ విప్లవాన్ని కేవలం మరో సాంకేతిక మార్పుగా చూడకూడదన్నారు. అలా జరిగితే మిగతా సంస్థలు తమ సొంత పరిజ్ఞానం, అనుభవం, పోటీపడే సామర్థ్యాన్ని కోల్పోయి పూర్తిగా వాటిపైనే ఆధారపడాల్సి వచ్చే ప్రమాదం ఉందని అంటున్నారు. గతంలో డిజిటల్ టూల్స్ ఉద్యోగుల ఉత్పాదకతను పెంచడానికి మాత్రమే ఉపయోగపడేవని.. కానీ ఇప్పుడు మనుషులు, ఏఐ వ్యవస్థలు పరస్పరం నేర్చుకునే కొత్త దశలోకి ప్రపంచం అడుగుపెడుతోందని వివరించారు. దీనిని ఆయన "కాగ్నిటివ్ లూప్"గా అభివర్ణించారు. భవిష్యత్తులో సంస్థల విజయాన్ని నిర్ణయించేది కేవలం డబ్బు లేదంటే యంత్రాలో కాదని నాదెళ్ల అభిప్రాయపడ్డారు. ఉద్యోగుల అనుభవం, ఆలోచనా శక్తి, నిర్ణయ సామర్థ్యం, సృజనాత్మకత ఎంత ముఖ్యమో.. ఏఐ ఆధారంగా సంస్థలు సొంతంగా అభివృద్ధి చేసుకునే సామర్థ్యాలు కూడా అంతే ముఖ్యమని చెప్పారు. అయితే ఈ రెండింటిలోనూ మనిషే కేంద్రబిందువుగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఏఐ ఎంత అభివృద్ధి చెందినా.. లక్ష్యాలను నిర్దేశించడం, కొత్త ఆలోచనలను సృష్టించడం, విభిన్న రంగాల మధ్య సంబంధాలను గుర్తించడం వంటి అంశాల్లో మనుషుల పాత్ర కీలకంగానే ఉంటుందని పేర్కొన్నారు. అయితే నాదెళ్ల ఆందోళన ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయన్నది కాదు. కొద్ది సంఖ్యలో ఉన్న శక్తివంతమైన ఏఐ మోడళ్లపై ప్రపంచంలోని కంపెనీలు పూర్తిగా ఆధారపడిపోతే.. తమ సొంత పరిజ్ఞానం, మేధోసంపత్తి, అనుభవాన్ని క్రమంగా కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. "ప్రతి రంగంలోని ప్రతి సంస్థ సృష్టించిన విలువ అంతా కొద్ది ఏఐ మోడళ్ల చేతుల్లోకి వెళ్లే ప్రపంచాన్ని మనలో ఎవరూ కోరుకోరు" అని వ్యాఖ్యానించారాయన. ఈ సందర్భంలో ఆయన ప్రపంచీకరణ తొలి దశను ఉదాహరణగా ప్రస్తావించారు. తయారీ పరిశ్రమలు ఒక దేశం నుంచి మరో దేశానికి తరలిపోవడంతో ఆర్థిక వృద్ధి కాగితాలపై కనిపించినా.. అనేక ప్రాంతాలు, వర్గాలు శాశ్వతంగా నష్టపోయాయని గుర్తు చేశారు. అదే పరిస్థితి ఇప్పుడు ఏఐ యుగంలోనూ పునరావృతమయ్యే ప్రమాదం ఉందన్నారు. కంపెనీలు దశాబ్దాలుగా కూడబెట్టుకున్న అనుభవం, పరిజ్ఞానం, వ్యాపార విలువ మొత్తం ఏఐ వ్యవస్థల్లో కలిసిపోతే.. దాని ద్వారా వచ్చే లాభాలు మాత్రం కొద్ది సంస్థలకే పరిమితమయ్యే ప్రమాదాన్ని ఆయన ఎత్తిచూపారు. అందుకే "ఫ్రాంటియర్ మోడల్" కాకుండా "ఫ్రాంటియర్ ఎకోసిస్టమ్" అవసరమని నాదెళ్ల సూచించారు. అంటే.. కొద్ది కంపెనీలు మాత్రమే ఏఐని నియంత్రించే పరిస్థితి కాకుండా.. వివిధ దేశాలు, సంస్థలు, పరిశ్రమలు తమ సొంత ఏఐ సామర్థ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉండాలన్నారు. అప్పుడు మాత్రమే ఏఐ వల్ల వచ్చే ఆర్థిక ప్రయోజనాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరుతాయని అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా.. ఏఐ భవిష్యత్తుపై ఇతర సాంకేతిక దిగ్గజాలు కూడా ఆందోళనలు వ్యక్తం చేస్తున్నాయి. ఆంత్రోపిక్ సీఈవో డారియో అమోడీ ఇటీవల ఏఐ కారణంగా దీర్ఘకాలిక ఉద్యోగ నష్టాలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. ఏఐ మానవ మేధస్సుతో చేసే అనేక పనులను భర్తీ చేస్తే.. ఉద్యోగాలపై శాశ్వత ప్రభావం పడొచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. పరిస్థితి మరింత తీవ్రమైతే ప్రభుత్వాలు ఉద్యోగుల కోసం ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాల్సి రావచ్చని కూడా సూచించారు. మరోవైపు, ఎన్విడియా అధినేత జెన్సెన్ హువాంగ్ మాత్రం ఉద్యోగ కోతలన్నింటికీ ఏఐనే కారణమని చెప్పడం సరైంది కాదని వ్యాఖ్యానించారు. జనరేటివ్ ఏఐ అనేది విస్తృతంగా అందుబాటులోకి రాకముందే అనేక సంస్థలు ఉద్యోగులను తొలగించాయని గుర్తుచేశారు. ఉద్యోగాల కోత వెనుక ఆర్థిక పరిస్థితులు, వ్యాపార వ్యూహాలు, మార్కెట్ మార్పులు వంటి అనేక కారణాలు ఉంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఏఐపై ప్రపంచవ్యాప్తంగా చర్చ ఇప్పుడు కొత్త దశకు చేరుకుంది. ఒకవైపు అపార అవకాశాలు కనిపిస్తుంటే.. మరోవైపు ఉద్యోగాలు, వ్యాపారాలు, ఆర్థిక వ్యవస్థల భవిష్యత్తుపై ఆందోళనలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సత్య నాదెళ్ల చేసిన హెచ్చరిక ఒక కీలక ప్రశ్నను ముందుకు తెచ్చింది. ఏఐ మనిషిని మరింత శక్తివంతం చేసే సాధనంగా మారుతుందా? లేదంటే కొద్ది కంపెనీల చేతుల్లోనే శక్తిని కేంద్రీకరించి మిగతా ప్రపంచాన్ని ఆధారపడేలా చేస్తుందా? రానున్న దశాబ్దంలో ఈ ప్రశ్నకు దొరికే సమాధానమే ప్రపంచ భవిష్యత్తును నిర్ణయించే అవకాశం ఉంది.

# హమ్మయ్యా.. శాస్త్రవేత్తల భయం తప్పింది!




విశ్వంలో ఇంకా ఛేదించాల్సిన రహస్యాలు ఎన్నో ఉన్నాయి. అసలు విశ్వం ఎలా ఏర్పడింది? ఎంత పెద్దది? భవిష్యత్తులో ఎలా మారబోతోంది? వంటి ప్రశ్నలకు ఇప్పటికీ పూర్తి సమాధానాలు లేవు. అలాంటి సమయంలో ఓ అధ్యయనం బాంబును పేల్చింది. విశ్వం విస్తరణ వేగం తగ్గుతోందని.. దాన్ని ముందుకు నడిపిస్తోందని భావిస్తున్న 'డార్క్ ఎనర్జీ' సిద్ధాంతంలోనే లోపాలుండొచ్చని పేర్కొంది. దీంతో శాస్త్ర ప్రపంచంలో పెద్ద చర్చ మొదలైంది. అయితే తాజా పరిశోధన ఆ సందేహాలకు చెక్ పెట్టి పారేసింది. మన విశ్వం విస్తరిస్తోందని శాస్త్రవేత్తలకు చాలా కాలంగా తెలుసు. అయితే 1998లో జరిగిన పరిశోధనలు మరో కీలక విషయాన్ని వెల్లడించాయి. విశ్వం కేవలం విస్తరించడం మాత్రమే కాదు.. ఆ విస్తరణ వేగం కూడా క్రమంగా పెరుగుతోందని గుర్తించారు. ఈ ఆవిష్కరణకు గాను 2011లో భౌతిక శాస్త్ర నోబెల్ బహుమతి లభించింది. ఈ వేగవంతమైన విస్తరణ వెనుక పనిచేస్తున్న రహస్య శక్తినే శాస్త్రవేత్తలు "డార్క్ ఎనర్జీ"గా పిలుస్తున్నారు. అయితే అది అసలు ఏమిటో ఇప్పటికీ ఎవరికీ తెలియదు. విశ్వం ఎంత వేగంగా విస్తరిస్తోందో తెలుసుకోవడానికి శాస్త్రవేత్తలు టైప్-1ఏ సూపర్‌నోవా(ుఎజూవ ఋ ాబజూవతీఅశీఖ) అనే ప్రత్యేక నక్షత్ర పేలుళ్లను పరిశీలిస్తారు. ఇవి దాదాపు ఒకే ప్రకాశంతో పేలుతుండటంతో వాటి దూరాన్ని కచ్చితంగా అంచనా వేయగలుగుతారు. ఈ లెక్కల ఆధారంగానే డార్క్ ఎనర్జీ ఉనికిపై శాస్త్రవేత్తలు నిర్ణయాలకు వస్తుంటారు. అయితే.. 2025లో దక్షిణ కొరియాకు చెందిన కొందరు పరిశోధకులు చేసిన అధ్యయనం శాస్త్ర ప్రపంచంలో పెద్ద చర్చకు దారితీసింది. ఇప్పటివరకు విశ్వ విస్తరణను కొలవడానికి ఉపయోగిస్తున్న పద్ధతుల్లో లోపాలుండొచ్చని, డార్క్ ఎనర్జీ పాత్రను తప్పుగా అర్థం చేసుకుని ఉండొచ్చని వాళ్లు వాదించారు. అంతేకాదు.. విశ్వ విస్తరణ వేగం పెరగడం లేదని, ఇప్పటివరకు వచ్చిన ఫలితాలు లెక్కల పొరపాట్ల వల్ల కనిపించి ఉండొచ్చని సూచించారు. దీంతో ఇన్నేళ్లుగా అంగీకరిస్తూ వచ్చిన సిద్ధాంతాలపై కొత్త సందేహాలు వ్యక్తమయ్యాయి. అయితే బ్రిటన్‌లోని సౌతాంప్టన్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు, నోబెల్ విజేతల బృందంతో కలిసి పాత డేటాను మరోసారి పరిశీలించారు. ముఖ్యంగా "టైప్-1ఏ సూపర్‌నోవా"లపై దృష్టి సారించారు. ఆపై కొరియా అధ్యయనంలో కొన్ని పొరపాట్లు ఉన్నాయని గుర్తించారు. ఒక గ్రామంలో 80 ఏళ్ల వృద్ధుడు ఉన్నాడనుకోండి. అదే గ్రామంలో 20 ఏళ్ల యువకుడు కూడా ఉంటాడు. గ్రామం 80 ఏళ్ల పాతది కాబట్టి అందరూ 80 ఏళ్లవాళ్లే అని చెప్పలేం కదా!. అలాగే ఒక గెలాక్సీ చాలా పురాతనమైనది కావచ్చు. కానీ అందులో ఉన్న ప్రతి నక్షత్రం కూడా అంతే పాతదని భావించలేం. 2025లో వచ్చిన అధ్యయనం గెలాక్సీ వయస్సునే అందులో పేలిన నక్షత్రం వయస్సుగా పరిగణించిందని, అక్కడే లెక్క తప్పిందని తాజా పరిశోధకులు చెబుతున్నారు. కాబట్టి విశ్వం ఇప్పటికీ వేగంగానే విస్తరిస్తోందని, డార్క్ ఎనర్జీ సిద్ధాంతం ఇప్పటికీ సరైనదేనని తేల్చారు.

**డార్క్ ఎనర్జీ అంటే..**

సాధారణంగా మనకు కనిపించే నక్షత్రాలు, గ్రహాలు, గ్యాస్, ధూళి వంటి పదార్థం విశ్వంలో కేవలం 5 శాతం మాత్రమే ఉంటుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. మిగిలిన భాగంలో డార్క్ మ్యాటర్, డార్క్ ఎనర్జీ వంటి రహస్య అంశాలే ఎక్కువగా ఉన్నాయని భావిస్తున్నారు. అందులో డార్క్ ఎనర్జీ విశ్వాన్ని మరింత వేగంగా విస్తరించే శక్తిగా పనిచేస్తోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తాజా అధ్యయనం డార్క్ ఎనర్జీ లేదన్న వాదనను కొట్టిపారేసినప్పటికీ.. అది అసలు ఏమిటి? ఎలా పనిచేస్తుంది? ఎక్కడి నుంచి వస్తుంది? అనే ప్రశ్నలకు మాత్రం ఇప్పటికీ సమాధానం లేదు. అంటే.. డార్క్ ఎనర్జీ ఉనికిపై శాస్త్రవేత్తలకు విశ్వాసం పెరిగింది గానీ, దాని అసలు స్వరూపం గుట్టుమాత్రం ఇంకా వీడాల్సి ఉందన్నమాట.

# 'మెటాలో ఇక భారీ తొలగింపులు ఉండకపోవచ్చు'




సోషల్ మీడియా దిగ్గజం మెటా కృత్రిమ మేధస్సు ఆధారిత సంస్థగా రూపాంతరం చెందే క్రమంలో ఉద్యోగులకు సంబంధించి కొన్ని పొరపాట్లు జరిగాయని దాని అధినేత మార్క్ జుకర్‌బర్గ్ అంగీకరించారు. అంతర్గత మెమోలో ఉద్యోగులను ఉద్దేశించి, వేగంగా మారుతున్న ఏఐ ప్రపంచంలో ఇలాంటి సవాళ్లు సహజమని జుకర్‌బర్గ్ పేర్కొన్నారు. "ఈ మార్పుల సంక్లిష్టత దృష్ట్యా మేము తప్పులు చేశాం. భవిష్యత్తులో కూడా కొన్ని తప్పిదాలు జరిగే అవకాశం ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం మెటా సంస్థ తన వ్యాపార వ్యూహాన్ని పూర్తిగా ఏఐ చుట్టూ పునర్వ్యవస్థీకరిస్తోంది. ఇందుకోసం డేటా సెంటర్లు, ఏఐ మౌలిక సదుపాయాలు, సూపర్ ఇంటెలిజెన్స్ ప్రాజెక్టులపై వందల బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతోంది. ఈ క్రమంలో సంస్థలో విస్తృత స్థాయి పునర్నిర్మాణం చేపట్టింది. మే నెలలో ప్రపంచవ్యాప్తంగా సుమారు 10 శాతం ఉద్యోగులను తొలగించగా, మరో 7,000 మంది ఉద్యోగులను ఏఐ సంబంధిత బృందాలకు బదిలీ చేసింది. అయితే ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనలను తగ్గించే ప్రయత్నంలో జుకర్‌బర్గ్ కీలక హామీ ఇచ్చారు. "ఈ ఏడాది సంస్థవ్యాప్తంగా మరోసారి భారీ స్థాయి ఉద్యోగ కోతలు ఉంటాయని మేము భావించడం లేదు" అని స్పష్టం చేశారు. ప్రపంచ పరిస్థితులు వేగంగా మారుతున్నందున అతిగా హామీలు ఇవ్వలేనప్పటికీ, సంస్థాగత స్థిరత్వాన్ని కాపాడటమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఏఐ మోడళ్ల శిక్షణ కోసం బదిలీ చేసిన ఉద్యోగులకు కొత్త అవకాశాలు కల్పించేందుకు సంస్థ కృషి చేస్తోందని ఆయన వెల్లడించారు. అవసరమైతే కొన్ని విభాగాల్లో తగ్గించిన సిబ్బందిని తిరిగి ఇతర బృందాలకు మార్చే అవకాశమూ ఉంటుందని చెప్పారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఉద్యోగుల నైపుణ్యాలను వినియోగించుకోవడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, మెటాలో జరిగిన ఏఐ ఆధారిత పునర్వ్యవస్థీకరణపై కొంత అసంతృప్తి కూడా వ్యక్తమవుతోంది. కొత్తగా ఏర్పాటైన ఏఐ విభాగాల్లో పని స్వరూపం, బాధ్యతలపై కొందరు ఉద్యోగులు అసహనం వ్యక్తం చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని పెంచేందుకు జూలైలో భారీ ఏఐ హ్యాకథాన్, టీమ్ ఈవెంట్లు నిర్వహించేందుకు సంస్థ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఏఐ పోటీలో ముందంజలో నిలవాలన్న లక్ష్యంతో మెటా దూసుకెళ్తున్నప్పటికీ, ఉద్యోగుల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం, సంస్థాగత మార్పులను సమతుల్యం చేయడం కంపెనీకి ఇప్పుడు అతిపెద్ద సవాలుగా మారింది.

Printed, Polished, Owned by BESTHA SHIVA RAMUDU & Printed UTTEJITA PRINTERS H.NO -801, BUDHAWAR PETA, KURNOOL, ANDHRA PRADESH - 518001.
APTEL2023/88704 & Published at D.No.4-458, PAIGEAR, NANDAVARAM, V&P. KURNOOLD.T. (A.P)-518343,CELL:9494741301.